teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 11 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 11 జూన్ 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.


## తెలంగాణలో తప్పిన భారీ రైలు ప్రమాదం

### సాంకేతిక లోపం కారణంగా నిలిచిపోయిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్



నల్గొండ, జూన్ 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో భారీ రైలు ప్రమాదం తప్పింది. సాంకేతిక లోపం కారణంగా జన్మభూమి ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. నల్లగొండ రైల్వే స్టేషన్‌లో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. వెంటనే అప్రమత్తం అయిన అధికారులు ఇంజిన్ ఫెయిల్ కావడంతోనే ట్రెయిన్ ఆగిపోయిందని గుర్తించారు. మరో ఇంజిన్‌ను తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేశారు. స్టేషన్‌కు వచ్చాక ఇంజిన్ ఫెయిల్ కావడంతో భారీ ప్రమాదం తప్పిందని అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పునరుద్ధరణకు కొన్ని గంటల సమయం పట్టిందని అధికారులు తెలిపారు.



## దేశ అభివృద్ధిలో విద్యుత్ శాఖదే కీలక పాత్ర

**శాఖ ఉద్యోగుల కుటుంబాలకు భరోసా కల్పించేందుకు యొచన**

**రూ.కోటి ఇన్సూరెన్స్ కు ఎస్‌బీఐతో ఎంవోయూ**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి**

హైదరాబాద్, జూన్ 10 (తీన్మార్ న్యూస్): దేశ అభివృద్ధిలో విద్యుత్ శాఖదే కీలక పాత్ర అని, ప్రాణాలకు తెగించి కష్టపడి పని చేస్తున్న ఈ శాఖ ఉద్యోగుల కుటుంబాలకు భరోసా కల్పించేలా రూ.కోటి ఇన్సూరెన్స్ ఇచ్చేందుకు ఎస్‌బీఐతో ఎంవోయూ కుదుర్చుకున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని

మిగతా 2 లో



## రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ హెచ్చరిక

### వాతావరణంలో ఒక్కసారిగా భిన్నమైన మార్పులు

**రానున్న మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు**

**ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ**

రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. గత రెండు మూడు రోజులుగా ఎండలు దంచికొట్టగా వాతావరణంలో ఒక్కసారిగా భిన్నమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో వాతావరణం చల్లబడింది. తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.




### గ్రూప్ 3 సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ పై టీజీపీఎస్సీ

## కీలక నిర్ణయం

### గ్రూప్ 3 సర్టిఫికేషన్ వెరిఫికేషన్ వాయిదా

**గ్రూప్ 2 నియామకాలు తర్వాతే గ్రూప్ 3 సర్టిఫికెట్స్ వెరిఫికేషన్**




హైదరాబాద్, జూన్ 10 (తీన్మార్ న్యూస్): గ్రూప్ 3 సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ పై టీజీపీఎస్సీ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రూప్ 3 సర్టిఫికేషన్ వెరిఫికేషన్ వాయిదా వేసింది టీజీపీఎస్సీ. గ్రూప్ 2 నియామకాలు పూర్తయిన తర్వాతే గ్రూప్ 3 సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ నిర్వహించాలని టీజీపీఎస్సీ ప్రకటించింది. బ్యాక్ లాగ్ పోస్టులతో సమస్య

మిగతా 2 లో

## తెలంగాణ హైకోర్టులో హరీష్‌రావుకు ఊరట

**ఆధారాలు లేకపోవడంతో చక్రధర్ పిటిషన్‌ను కొట్టివేత**



02



## బస్ భవన్ వద్ద ఉద్రిక్తత

**జాగృతి అధ్యక్షురాలు కవిత అరెస్ట్**

**ముట్టడికి యత్నించిన జాగృతి కార్యకర్తలు**

**బస్ పాస్ ధరల పెంపునకు నిరసనగా బస్ భవన్ ఎదుట బైటయింపు**

హైదరాబాద్, జూన్ 10 (తీన్మార్ న్యూస్): విద్యార్థులు, జనరల్ బస్‌పాస్‌ల చార్జీలను తాజాగా తెలంగాణ ఆర్టీసీ పెంచిన దాదాపు దాదాపు 20 శాతం విషయం తెలిసిందే. దీంతో ప్రజలు, విద్యార్థులు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే భవన్ వద్ద ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో బస్ పాస్ ధరల

మిగతా 2 లో

## జులై మొదటి వారంలో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్

### ఆగస్టు 14 లోపు ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి

**ఆలోపే తరగతులు ప్రారంభిస్తాం**

**ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.బాలకృష్ణారెడ్డి**




హైదరాబాద్, జూన్ 10 (తీన్మార్ న్యూస్): ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ పై ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.బాలకృష్ణారెడ్డి కీలక అప్ డేట్ ఇచ్చారు. జులై మొదటి

మిగతా 2 లో



02

## దేశవ్యాప్తంగా మోడీ పాలనపై ఫోటో ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు

**జూన్ 9 నుంచి మోడీ 3.0 ప్రభుత్వం తొలి వార్షికోత్సవం**

**12వ ఏడాదిలోకి అడుగు పెట్టిన నేపథ్యంలో కార్యక్రమం**

## కాళేశ్వరం కమిషన్ ముందు హాజరుకానున్న కెసిఆర్


**విచారణలో చోటు చేసుకోనున్న కీలక మార్పు**



.. వివరాలు 2లో

## హైడ్రా చేతికి తెలంగాణ ప్రభుత్వం కీలక బాధ్యతలు

**వర్షాకాలంలో వరద ముంపు సమస్యల్ని పరిష్కరించాలని ఆదేశాలు**






## బస్ పాస్ ధరలపై స్పందించిన రవాణా శాఖ మంత్రి పొన్నం

### టోల్ ట్యాక్స్ రూట్లలో మాత్రమే బస్ పాస్ చార్జీలు పెంచాం

హైదరాబాద్, జూన్ 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో పెరిగిన బస్ పాస్ ధరలపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. టోల్ ట్యాక్స్ లను కేంద్ర ప్రభుత్వం పెంచిన నేపథ్యంలో ఆ నష్టాన్ని పూరించుకునేందుకు

మిగతా 2 లో

## చాట్‌బాట్ చాట్ జీబీటీ సేవల్లో తీవ్ర అంతరాయం

**పలు దేశాల నుండి వినియోగదారుల ఫిర్యాదులు**

**ఏఐ పై ఆధారపడిన అనేక మందికి తీవ్ర ఇబ్బందులు**




న్యూ ఢిల్లీ, జూన్ 10 (తీన్మార్ న్యూస్): ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది వినియోగదారులను ఆకర్షించిన కృత్రిమ మేధస్సు చాట్‌బాట్ చాట్ జీబీటీ సేవల్లో తీవ్ర అంతరాయం ఏర్పడింది. అమెరికా, భారతదేశంతో సహా పలు దేశాల నుండి వినియోగదారులు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. చాట్ జీబీటీ సేవలు నిలిచిపోవడంతో రోజువారీ పనులు, అకడమిక్ ప్రాజెక్టులు, మరియు వృత్తిపరమైన

మిగతా 2 లో

## ఆషాఢమాస బోనాలపై మంత్రి కొండా సురేఖ సమీక్ష

**బోనాల విజయవంతానికి అధికారులకు దిశానిర్దేశం**



.. వివరాలు 2లో


# రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ హెచ్చరిక

హైదరాబాద్, జూన్ 10 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. గత రెండు మూడు రోజులుగా ఎండలు దంచికొట్టగా వాతావరణంలో ఒక్కసారిగా భిన్నమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో వాతావరణం చల్లబడింది. తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. నల్గొండ, మెదక్, వరంగల్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, హైదరాబాద్, రంగారెడ్డి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చే మూడురోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడతాయన్నారు. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం, తూర్పు దిశల నుంచి తెలంగాణ వైపునకు ఈదురుగాలులు వీస్తాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పిడుగులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ




తెలిపింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద ఉండరాదని తెలిపారు. ఈ క్రమంలో అత్యవసరమైతే తప్ప ఇళ్లలో నుంచి బయటకు రావొద్దని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

# హైడ్రా చేతికి తెలంగాణ ప్రభుత్వం కీలక బాధ్యతలు




హైదరాబాద్, జూన్ 10 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌లో ప్రభుత్వ ఆస్తులు, చెరువుల పరిరక్షణ కోసం సర్కారు ఏర్పాటు చేసిన హైడ్రా చేతికి తెలంగాణ ప్రభుత్వం కీలక బాధ్యతల్ని అప్పగించింది. వర్షాకాలంలో నగరంలో వరద ముంపు సమస్యల్ని పరిష్కరించాలని ఆదేశించింది. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడారు. వర్షాకాలంలో వరద ముంపు సమస్యలు ఇపుడు హైడ్రా చూస్తుంది. మన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ జీహెచ్ఎంసీ నుండి హైడ్రాకు మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. డిజాస్టర్ మేనేజ్మెంట్ టీమ్స్ ఒక గొడుగు కిందకు రావడం వల్ల పని ఈజీ అవుతుంది. వర్షాకాలంలో మాత్రమే హైడ్రా బాధ్యత. వర్షాకాలంలో చేయాల్సినవి హైడ్రా చేస్తుంది. వర్షాకాలం ముందు చేయాల్సినవి జీహెచ్ఎంసీ చేస్తుంది. నాలాల రక్షణ, నాలాల్లో పూడిక తీత లేకుండా చూస్తాం. మొత్తం నగరాన్ని మార్చేస్తాం అని చెప్పను కానీ బెటర్ చేస్తాం. ఇప్పటికే విరిగిపోయి చెట్లను గుర్తిస్తున్నాం. ప్రమాదకర మ్యాన్ హోల్స్‌ను గుర్తిస్తున్నాం. నాలాల్లో వరద నీరు సాఫీగా వెళ్లేలా చేస్తాం. మా దగ్గర 30 టీమ్స్, జీహెచ్ఎంసీ వద్ద దగ్గర 150 టీమ్స్, ట్రాఫిక్ 20 టీమ్స్ ఉన్నాయి. అన్ని టీములు పని చేస్తున్నాయా లేదా చెక్ చేస్తాం. వరద నీరు సరిగా వెళ్లేలా టీమ్స్ పని చేస్తున్నాయా లేదా అని చూస్తాం. ఎంత వర్షం పడుతుందో దాని మీద పరిస్థితి ఆధారపడి ఉంటుంది' అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు.

# దేశవ్యాప్తంగా మోడీ పాలనపై ఫోటో ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు

హైదరాబాద్, జూన్ 10 (తీన్మార్ న్యూస్): ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాలన 11 ఏళ్ళు పూర్తిచేసుకుని, 12వ ఏడాదిలోకి అడుగు పెట్టింది. జూన్ 9 నుంచి మోడీ 3.0 ప్రభుత్వం తొలి వార్షికోత్సవం జరుపుతోంది. దేశవ్యాప్తంగా మోడీ పాలనపై ఫోటో ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలోనే నరేంద్ర మోడీ పదకొండేళ్ల పాలనపై మంగళవారం హైదారబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. వికసిత్ భారత్ కా అమృత్ కాల్ ప్రదర్శనశాల పేరుతో ఫోటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రారంభించారు. మోడీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి, సాహసోపేతమైన నిర్ణయాలు ప్రతిబింబిస్తూ ఎగ్జిబిషన్‌లో బ్యానర్లు, ఫోటోలు ఏర్పాటు చేశారు. కాగా, ప్రధాని నరేంద్ర మోడీ 11 ఏళ్ల పాలనలో ఒక్క అవినీతి ఆరోపణ లేదని, పేదల సంక్షేమానికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూర్చాలని, సంక్షేమ ఫలాలను అందించాలనే లక్ష్యంతో మోడీ ప్రభుత్వం ముందుకెళ్తోందని స్పష్టం చేశారు.

# బస్ పాస్ ధరలపై స్పందించిన రవాణా శాఖ మంత్రి పొన్నం

మొదటి పేజీ తరువాయి



టోల్ ట్యాక్స్ రూట్లలో మాత్రమే బస్ పాస్ చార్జీలు పెంచామని చెప్పారు. హైదరాబాద్ లో ఇక నుంచి విద్యార్థులకు మెట్రో ఎక్స్ ప్రెస్ ల్లో కూడా ప్రయాణ సౌకర్యం కల్పించామని అందువల్లే ఇక్కడ కూడా కాస్త బస్ పాస్ చార్జీలు పెంచామన్నారు. కొన్నేళ్లుగా బస్ పాస్ చార్జీలు పెంచలేదని మహాలక్ష్మి స్కీమ్ ఉచిత ప్రయాణం కింద రూ. 6 వేల కోట్లు ఆర్టీసీకి ఇచ్చామన్నారు. మహాలక్ష్మి స్కీమ్ కారణంగా ఆర్డీనరీ బస్సుల్లో విద్యార్థులు ప్రయాణించడం ఇబ్బందిగా మారిందని అందువల్ల వారికి మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లోనూ అనుమతి ఇస్తున్నామన్నారు. పెంచిన చార్జీలు వారు మోయలేనంత భారమైనదేమి కాదని అన్నారు. పెరుగుతున్న అన్ని రకాల ధరల వల్ల స్వల్పమార్పులు చేశామన్నారు. ఒక వేళ కేంద్ర ప్రభుత్వం టోల్ ట్యాక్స్ తగ్గిస్తే ఒకే నిమిషంలో ఆ రూట్లలోని బస్ పాస్ చార్జీలను తగ్గించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

# బస్ భవన్ వద్ద ఉద్రిక్తత



మొదటి పేజీ తరువాయి

పెంపునకు నిరసనగా మంగళవారం బస్ భవన్ ముట్టడికి యత్నించారు. పెద్ద ఎత్తున జాగృతి కార్యకర్తలతో కలిసి బస్ భవన్ ఎదుట ఎమ్మెల్సీ కవిత బైటాయించారు. ఈ క్రమంలోనే ఘర్షణ వాతావరణం ఏర్పడటంతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడుతూ వెంటనే ఆర్టీసీ పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బస్‌పాస్ ధరలను పెంచి ప్రజలపై ప్రభుత్వం పెనుభారాన్ని మోపిందని మండిపడ్డారు. విద్యార్థులు, చిరుద్యోగులపై తీవ్రంగా ఆర్థిక భారం పడుతుందని, బస్‌పాస్ ధరలను పెంచి ప్రజలపై గుదిబండను మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పెంపుతో ఒక్క ప్రయాణికుడిపై నెలకు దాదాపు రూ. 300 పైగా భారం పడుతుందని అంచనా వేశారు. మరోవైపు అనేక రూట్లలో విద్యార్థుల కోసం బస్సులు నడపడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రజలను దోచుకోవడానికి ప్రభుత్వం అలవాటు పడిందన్నారు. ఎమ్మెల్సీ కవితను తొలుత చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్‌కు పోలీసులు తరలించారు. ఇప్పుడు కంచన్ బాగ్ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఇంతకు ఏ పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నారో స్పష్టంగా చెప్పడం లేదని పోలీసులపై తెలంగాణ జాగృతి కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఫోన్ లిఫ్ట్ చేసి హలో బదులు జై తెలంగాణ అని అనాలి

## ప్రతి బోనం మీద జై తెలంగాణ నినాదం రాయాలి

## తెలంగాణ ప్రజలకు కల్వకుంట్ల కవిత పిలుపు

ఫోన్ లిఫ్ట్ చేసి హలో అనే బదులు జై తెలంగాణ అని అనాలంటూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో కల్వకుంట్ల కవిత ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడారు. ఒకప్పుడు తెలుగు సినిమాలలో తెలంగాణ భాష యాస అంటే అవహేళనగా చూసేవారని ఫైర్ అయ్యారు. కానీ ఇప్పుడు తెలంగాణ భాష యాస లేకుండా సినిమా అసలు హిట్ కావడం లేదని సెటైర్లు పేల్చారు. అంతలా తెలంగాణ భాష జనాల్లోకి వెళ్లిందని వివరించారు. ఇప్పుడున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జై తెలంగాణ అన్న నినాదం చేయలేకపోతున్నాడని నిప్పులు చెరిగారు. కానీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పరిస్థితి వేరేలా ఉండేదని వివరించారు. కేసీఆర్ ప్రతి మాట తెలంగాణ యాసలోనే వస్తుందని చెప్పుకొచ్చారు. రానున్న బోనాల పండుగ సందర్భంగా ప్రతి బోనం మీద జై తెలంగాణ నినాదం రాయాలని పిలుపునిచ్చారు కల్వకుంట్ల కవిత. అలాగే ఫోన్ లిఫ్ట్ చేసినప్పుడు హలో అనే బదులు జై తెలంగాణ అనాలని వివరించారు.

# చాట్‌బాట్ "చాట్ జీపీటీ" సేవల్లో తీవ్ర అంతరాయం

మొదటి పేజీ తరువాయి




కార్యకలాపాలకు ఏఐ పై ఆధారపడిన అనేక మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఓపెన్ ఏఐ అభివృద్ధి చేసిన చాట్ జీపీటీ, సంభాషణ నైపుణ్యాలతో పాటు, కంటెంట్ సృష్టి, కోడింగ్, సమాచార శోధన వంటి అనేక పనులకు విస్తృతంగా ఉపయోగించబడుతోంది. సేవల్లో అంతరాయం ఏర్పడటంతో, వినియోగదారులు చాట్‌బాట్‌ను యాక్సెస్ చేయలేకపోవడం, ప్రశ్నలకు సమాధానాలు రాకపోవడం, లేదా ఆలస్యంగా స్పందించడం వంటి సమస్యలను ఎదుర్కొన్నారు. దీనిపై సోషల్ మీడియా వేదికల్లో ChatGPTDown అనే హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అయింది. తొలిసారిగా, చాట్ జీబీటీ వెబ్‌సైట్, ఏపీఐ లో ఒకేసారి అంతరాయం ఏర్పడింది. ఓపెన్ ఏఐ సంస్థ సాంకేతిక సమస్యను గుర్తించి, దానిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలో సేవలు పునరుద్ధరించబడతాయని ప్రకటించింది. ఈ సంఘటన ఏఐ సేవలను నిరంతరం అందుబాటులో ఉంచాల్సిన ఆవశ్యకతను, సాంకేతిక లోపాలు వినియోగదారులపై చూపే ప్రభావాన్ని మరోసారి గుర్తుచేసింది. సాంకేతిక సమస్యల కారణంగా ఈ అంతరాయం సంభవించినట్లు చాట్ జీపీటీ యాజమాన్యం ప్రకటించింది.

# కాళేశ్వరం కమిషన్ ముందు హాజరుకానున్న కెసిఆర్

హైదరాబాద్, జూన్ 10 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి, నాణ్యత లోపాల ఆరోపణలపై జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని కమిషన్ ముందు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు హాజరుకానున్నారు. విచారణలో కీలక మార్పు చోటుచేసుకుంది. ఓపెన్ కోర్టుకు బదులు ఇన్-కెమెరా (మూసివేసిన విచారణ)లో కేసీఆర్ సమాధానాలు చెప్పనున్నారు. మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఆయనకు ఈ అవకాశం కల్పించినట్లు కమిషన్ తెలిపింది. కేసీఆర్ ఉదయం 11:15 గంటలకు కమిషన్ ముందు 115వ సాక్షిగా హాజరై, ప్రాజెక్టు నిర్మాణంలోని డిజైన్, నాణ్యత, ఆర్థిక అంశాలు, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ లోపాలపై ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వనున్నారు. ఈ విచారణకు ముందు, కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో మాజీ మంత్రి హరీష్ రావు, ప్రశాంత్ రెడ్డితో రెండు రోజుల పాటు సుదీర్ఘ చర్చలు జరిపినట్లు సమాచారం. ఇప్పటికే కమిషన్ 100 మందికి పైగా అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను విచారించి, 400 పేజీల నివేదికను సిద్ధం చేసింది. ఈ నెలాఖరులోగా తుది నివేదికను ప్రభుత్వానికి తెలియచేయనున్నట్లు తెలుస్తోంది. ఈ విచారణలో మాజీ మంత్రి హరీష్ రావు జూన్ 9న, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ జూన్ 6న హాజరై సమాధానాలు ఇచ్చారు. ఈటల, బ్యారేజీల నిర్మాణ నిర్ణయాలు కేసీఆర్ నేతృత్వంలోని క్యాబినెట్‌లోనే జరిగాయని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు ఈ విచారణను రాజకీయ కక్షతో కూడిన చర్యగా ఆరోపిస్తున్నారు.



# గ్రూప్ 3 సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ పై టీజీపీఎస్సీ కీలక నిర్ణయం



మొదటి పేజీ తరువాయి

రాకుండా ఉండాలనే ఉద్దేవంలో గ్రూప్ 3 సర్టిఫికెట్స్ వెరిఫికేన్ వాయిదా వేసింది టీజీపీఎస్సీ. 1388 పోస్టుల కోసం గ్రూప్-3 సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ప్రక్రియ జూన్ 18, 2025 నుండి జులై 8, 2025 వరకు, రిజర్వ్ డే జులై 9 నిర్వహించాలని ఇప్పటికే షెడ్యూల్ చేసింది. గ్రూప్ 2 నియామకాలు చేపడితే మిగిలిన బ్యాక్ లాగ్ పోస్టులతో సమస్య రాకుండా ఉండేందుకు గ్రూప్ 3 సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ వాయిదా వేసినట్లు టీజీపీఎస్సీ ప్రకటించింది. గతంలో గ్రూప్-3కి సంబంధించి 1,388 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెల్సిందే. దానికి సంబంధించి రాత పరీక్ష నిర్వహించి ఫలితాలను మార్చి 15న విడుదల చేసింది. తాజాగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ షెడ్యూల్‌తో పాటు అందుకు హాజరయ్యే అభ్యర్థుల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచింది.

# తెలంగాణ హైకోర్టులో హరీష్ రావుకు ఊరట

హైదరాబాద్, జూన్ 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ హైకోర్టులో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావుకు ఊరట లభించింది. 2023 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన గెలుపు చెల్లదంటూ బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రస్తుత కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ పిటిషన్ దాఖలు చేశారు. హరీష్ రావు తన ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారాన్ని అందించాడని, అతని ఎన్నికపై అనర్హత వేటు వేయాలని కోర్టును కోరారు. ఆ పిటిషన్ పై మంగళవారం విచారించిన హైకోర్టు సరైన ఆధారాలు లేకపోవడంతో చక్రధర్ గౌడ్ పిటిషన్‌ను కొట్టివేసింది.

# దేశ అభివృద్ధిలో విద్యుత్ శాఖదే కీలక పాత్ర

మొదటి పేజీ తరువాయి




ప్రజాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా మాట్లాడిన భట్టి ఈ ఒప్పందం ఉద్యోగుల్లో ధైర్యాన్ని, నమ్మకాన్ని పెంచుతుందన్నారు.

## రాష్ట్రంలో న్యూ ఎనర్జీ పాలసీ

తెలంగాణ ప్రభుత్వం న్యూ ఎనర్జీ పాలసీ తీసుకువచ్చిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో 2029-30 వరకు 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యంగా విద్యుత్ శాఖ పని చేస్తోందన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌మిషన్‌ను అప్‌డేట్ చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యుత్ శాఖలో పని చేసే ప్రతి వ్యక్తికి కీలక బాధ్యత ఉందని లైన్‌మెన్ నుంచి మినిస్టర్ వరకు అందరిదీ కీలక పాత్ర వహించాలని సూచించారు. రాష్ట్రానికి కావాల్సిన ఎనర్జీని ఉత్పత్తి చేసేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# జులై మొదటి వారంలో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్

మొదటి పేజీ తరువాయి

వారంలో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆగస్టు 14 లోపు ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి చేసి ఆలోపే తరగతులు ప్రారంభిస్తామని తెలిపారు. అనధికార విద్య సంస్థల్లో విద్యార్థులు చేరుతున్నారని అప్రమత్తం చేశారు. నాలుగు విద్యా సంస్థలు అనుమతి లేకుండా నడుపుతున్నారని అలాంటి నాలుగు విద్యా సంస్థలకు లీగల్ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. నెక్స్ట్ వేవ్, బైట్ ఎక్స్ ఎల్ టెక్ ఎండ్, లీప్ స్టార్ట్, ఇంటెల్లిపాత్ సంస్థలకు నోటీసులు ఇచ్చామని ఈ నెల 13వ తేదీ వరకు వివరణ కోసం గడువు ఇచ్చినట్లు తెలిపారు. డీమ్డ్ వర్సిటీలతో ఒప్పందం చేసుకున్నట్లు విద్యా సంస్థలు తెలుపుతున్నాయి. ఆ నాలుగు సంస్థలకు లీగల్ నోటీసులు. ఇంజినీరింగ్ విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారని డీమ్డ్ యూనివర్సిటీల అంశం కోర్టు పరిధిలో ఉందన్నారు. బీ కేటగిరి సీట్ల అంశం ఇంకా స్పష్టత రాలేదని ఈ విషయంలో ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. సిలబస్ మార్పుపై కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. కోర్సుల ఎంపికపై విద్యార్థులకు హెల్ప్ లైన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఉన్నత విద్యామండలిలో సంస్కరణలపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు.

# ఆషాడమాస బోనాలపై మంత్రి కొండా సురేఖ సమీక్ష




హైదరాబాద్, జూన్ 10 (తీన్మార్ న్యూస్): ఆషాడమాస బోనాలపై అధికారులతో మంత్రి కొండా సురేఖ హైదరాబాద్‌లోని సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. బోనాలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఎక్కడా చిన్న పొరపాట్లు కూడా లేకుండా అద్భుతంగా నిర్వహించాలని సూచించారు. మొత్తం 28 ఆయాల్లో ఆషాఢ బోనాల జాతర ఘనంగా జరపాలి. బడ్జెట్ లోటు కూడా లేదు ప్రభుత్వం నుండి ఇప్పటికే రూ.20 కోట్లు కేటాయించాం. గతంలో ఏం ప్రాబ్లం వచ్చింది ఇప్పుడు ఎలాంటి ఏర్పాట్లు చేయాలనేదానిపై ప్లాన్ ఆఫ్ యాక్షన్ తయారు చేసి ముందుకు వెళ్ళాలని అన్నారు.

ఈ సమీక్షలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డీజీపీ జితేందర్, ఎండోమెంట్ డైరెక్టర్ వెంకట రావు, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు. కాగా, గోల్కొండ కోటలో బోనాలు సమర్పించుకోవడంతో తెలంగాణ బోనాలు మొదలవుతాయి. ఆషాడ మాసపు మొదటి గురువారం బోనాలు ప్రారంభమవుతాయి. చివరి ఆదివారం వరకు ప్రతి రోజూ విశేష పూజలు జరుగుతాయి. గోల్కొండ బోనాలు ముగిసిన తర్వాత వారం సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనం సమర్పిస్తారు. ఆ వారం సికింద్రాబాద్ అంతటా బోనాలు జరుపుకుంటారు. ఆ తర్వాతి నుంచి లాల్ దర్వాజా, ధూల్‌పేట, బల్కంపేట, పాతబస్తీ, కొత్త బస్తీ అమ్మవారి ఆలయాల్లో బోనాల జరుగుతాయి.

# మధ్యాహ్న భోజన తయారీలో నాణ్యత ప్రమాణాలను పాటించాలి.- జిల్లా విద్యాశాఖ అధికారి జి పాణిని





ములుగు, జూన్ 10 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులుగా పనిచేస్తున్నటువంటి కుక్ కం హెల్పర్లు మరియు కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజనం నాణ్యతగా తయారు చేయడం పై ములుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల యందు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించబడిందని జిల్లా విద్యాశాఖ అధికారి జి పాణిని గారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ఆధారంగా నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ రుచికరమైన భోజనం అందించాలని, భోజనం తయారు చేసేటప్పుడు ఉపయోగించే కిరాణా సరుకులు, కూరగాయలు పరిశుభ్రమైనవి మరియు ఎక్స్పైరీ డేట్ ఉన్నవి మాత్రమే వినియోగించాలని, పరిశుభ్రత ప్రమాణాలను పాటించాలని అన్నారు. ప్రధానోపాధ్యాయులు మరియు మధ్యాహ్న భోజన ఇన్చార్జి ఉపాధ్యాయులు విధిగా మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న తీరును ప్రతిరోజు పరిశీలించి ఒక ఉపాధ్యాయుడు రుచి చూసిన అనంతరం విద్యార్థులకు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కార్యక్రమం నిర్వాహకులు గుళ్ళపెల్లి సాంబయ్య, డీసీఈవి కార్యదర్శి సూర్యనారాయణ, కోఆర్డినేటర్లు అర్షం రాజు, రమాదేవి, స్థానిక మండల విద్యాశాఖ అధికారి వజ్జ తిరుపతి, రిసోర్స్ పర్సన్లుగా ప్రధానోపాధ్యాయులు వినోద్ కుమార్, విద్యాసాగర్ వ్యవహరించగా జిల్లాలోని కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు మరియు ఆయా పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొనడం జరిగింది.

# నకిలీ విత్తనాలు, పురుగు మందులపై సమాచారం ఇవ్వండి

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




వరంగల్ జిల్లా, జూన్ 10 (తీన్మార్ న్యూస్): వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందింతే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు. వానాకాలం సాగు ప్రారంభమవుతున్న వేళను దృష్టిలో వుంచుకోని రైతన్న నకిలీ విత్తనాల బారీన పడకుండా ముందస్తు చర్యలకై వరంగల్ కమిషనరేట్ పోలీసులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా వరంగల్ కమిషనరేట్ పోలీసులు రూపొందించిన ప్రచార పోస్టర్లను మంగళవారం పోలీస్ కమిషనర్ అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఈ నకిలీ విత్తనాల నియంత్రణకై వరంగల్ పోలీస్ కమిషనర్ ఓ ప్రకటన చేస్తూ ఎవరైన వ్యాపారస్థులు, సంస్థలు, వ్యక్తులు రైతన్నను మోసం చేస్తూ నకిలీ విత్తనాలను, పురుగు మందులు విక్రయిస్తుతే పిడి యాక్ట్ క్రింద కేసు నమోదు చేయడం జరుగుతుందని. నకిలీ విత్తనాలను విక్రయాలను నియంత్రియించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం జరిగిందని. ఇప్పటికే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం ఒక కోటి 23 లక్షల విలువ నకిలీ పురుగు మందులు, విత్తనాలతో పాటు పెద్ద ఎత్తున గడ్డి మందును స్వాధీనం చేసుకోవడం తో పాటు 14మంది నిందితులను అరెస్ట్ చేసి జైలుకు తరలించడం జరిగిందని. ఇకపై ఎవరైనా నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు సమాచారం అందితే తక్షణమే స్థానిక పోలీసులకుగాని లేదా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఫోన్ నంబర్ 7799848333 ఫోన్ నంబరకు సమాచారం అందించాలని. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా వుంచబడుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, ఏసీపీ లు జితేందర్ రెడ్డి, డేవిడ్ రాజు, ఇన్స్పెక్టర్ విశ్వేశ్వర్ పాల్గొన్నారు.

# మాతృ మరణాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్ జిల్లా, జూన్ 10 (తీన్మార్ న్యూస్): మంగళవారం కలెక్టరేట్ ఎన్ఐసి సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, మాతృ మరణాల నివారణపై జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులు, ఏఎన్ఎం,ఆశ కార్యకర్తలు సంబంధిత సిబ్బందితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గర్భస్థ స్త్రీ శిశు మరణాలను తగ్గించాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు, వైద్య చికిత్స నిమిత్తం వచ్చే వారికి క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించాలని సూచించారు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారిగా సబ్ సెంటర్ల వారిగా వివరాలను గర్భిణీ స్త్రీల వివరాలు సేకరించాలని ప్రభుత్వ సూచనల ప్రకారం ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. వారికి కావలసిన వైద్య సూచనలు సలహాలు అందిస్తూ హై రిస్క్ కేసులు ఉన్నట్లు అయితే సంబంధిత ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ కు రిఫర్ చేయాలన్నారు, వారు ఇచ్చే సూచనలు, మందులు వాడుతున్న విషయాన్ని సరి చూసుకోవాలన్నారు. మెటర్నల్ మరణాలు జరగకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉంటూ జిల్లాలో వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో డాక్టర్ రవి రాథోడ్ డిఎం అండ్ హెచ్ ఓ, డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ ప్రమీల రావు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ గూడూరు సూపరింటెంట్ డాక్టర్ వీరన్న హెచ్ ఓ డి ప్రొఫెసర్ గానకాలజిస్ట్ డాక్టర్ శ్రీవిద్య, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ సారంగపాణి డాక్టర్ సుధీర్ రెడ్డి డాక్టర్ నాగేశ్వరరావు డాక్టర్ లక్ష్మీనారాయణ డాక్టర్ శ్రవణ్ కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ సురేష్ డాక్టర్ మౌనిక డాక్టర్ జ్వేలిత డాక్టర్ విరాజిత డాక్టర్ ప్రవీణ్, ఓబిలిశెట్టి రామకృష్ణ, అనిల్, సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సూపర్వైజర్స్ సిస్టర్లు ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

# సన్న బియ్యం పంపిణీతో సంబరాలు చేసుకుంటున్న నిరుపేదలు

### మూడు నెలల బియ్యం పంపిణీతో ప్రతి ఇంట్లో పండుగ వాతావరణం

### రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్న లబ్ధిదారులు

### జిల్లాలో ఎక్కువగా సన్నవడ్లను పండిస్తున్న రైతన్న





ములుగు జిల్లా, జూన్ 10 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లాలో రైతాంగం ఎక్కువగా సన్న వడ్లను సాగు చేస్తున్న తరుణంలో జిల్లాలో పండించిన వరి ధాన్యాన్ని ఇక్కడి ప్రాంత ప్రజలకు బియ్యం రూపంలో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్నది. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం గతంలో ఎన్నడు లేని విధంగా దేశంలో ఎక్కడ పంపిణీ చేయని సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని నిరుపేదలకు ఈ సంవత్సరం ఉగాది పర్వదినం నుండి ప్రారంభం కావడంతో జిల్లాలో సన్న బియ్యం తీసుకుంటున్న ప్రతి నిరుపేద కుటుంబాలలో సంబరాలు నెలకొన్నాయి. 1982 సంవత్సరంలో అప్పటి పాలకులు

ఒక్క రూపాయికి కిలో దొడ్డు బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టగా ఆ సమయంలో సంబరాల్లో మునిగిన ప్రజలు అదే తరహాలో నేడు సంతోషాలు వ్యక్తం చేస్తున్నారు. దొడ్డు బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టగా కాదు నిరుపేదలు మాత్రమే ఆహారంగా తీసుకున్నారే తప్ప 80 శాతం ప్రజలు వాటిని ఇతరులకు అమ్మకం చేయడంతో దొడ్డు బియ్యం పథకం పక్కదారి పట్టింది. దీంతో రాష్ట్రం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్ణయం తీసుకుని ప్రతి నిరుపేద వ్యక్తి ధనవంతుడు తింటున్న విధంగానే కడుపు నిండా ఆహారం తీసుకోవాలని ఉద్దేశంతో

సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టడమే కాకుండా సన్న వడ్లను రైతులు పండించే విధంగా ప్రభుత్వం ప్రోత్సహించి సన్న వడ్లను పండించిన ప్రతి రైతుకు క్వింటాకు 500 రూపాయల బోనస్ ఇవ్వడంతో రైతులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలకు సరిపడా బియ్యం ఈనెల 1వ తేదీ నుండి ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగించనున్నారు. మూడు నెలల బియ్యాన్ని తీసుకున్న ప్రతి నిరుపేద కుటుంబం ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది. ములుగు జిల్లాలో అధిక మొత్తంలో రైతులు వారి ధాన్యాన్ని సాగు చేస్తుండగా ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో ప్రతి రైతు సన్న వడ్లను పండించడానికే మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో పండిస్తున్న సన్న వడ్లను ఇక్కడి జిల్లా ప్రజలకు బియ్యం రూపంలో ప్రజలకు పంపిణీ చేయడం జరుగుతుంది. జిల్లాలోని 10 మండలాల్లో 94,628 తెల్ల రేషన్ కార్డులు కలిగిన నిరుపేదలు ఉండగా ప్రతి నెల వారికి 17 వేల 19 కన్నుల బియ్యాన్ని పంపిణీ చేయడం జరుగుతుంది. ప్రస్తుతం మూడు నెలల బియ్యం పంపిణీ చేస్తున్నడంతో ఐదు వేల 150 టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం రేషన్ షాపులకు సరఫరా చేసింది. దీంతో ఒకవైపు రైతులు మరోవైపు నిరుపేదల కళ్ళల్లో ఆనంద భాష్పాలు వెల్లువిరుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, రుణపడి ఉంటామని పేదలు అంటున్నారు.

**కడుపునిండా తిండి కంటి నిండా నిద్ర పోతున్నాం.**

లబ్ధిదారి రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యంతో పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్నాడంతో ప్రతిరోజు కడుపునిండా తిండి తినడమే కాకుండా కంటి నిండా నిద్రపోతున్నామని జిల్లాలోని ఏజెన్సీ గ్రామానికి చెందిన మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.

గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేయడం వలన తిండి తినలేకపోయామని, నేడు రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నడంతో కష్టపడి పని చేస్తూ ఇష్టంతో సన్న బియ్యంతో భోజనం చేస్తున్నామని అన్నారు. పేదల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయడం ఎంతో గొప్ప విషయమని వారు హర్షం వ్యక్తం చేశారు.

# సీజనల్ వ్యాధుల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమీక్ష సమావేశం డాక్టర్ బి రవి రాథోడ్



మహబూబాబాద్ జిల్లా, జూన్ 10 (తీన్మార్ న్యూస్): వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజారోగ్య పరిరక్షణకు సంబంధించి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ గారు సబ్ యూనిట్ ఆఫీసర్లతో,ఆరోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్లు, టైఫాయిడ్ మొదలైన వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మండలంలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, నిల్వ నీటి నిల్వాలు లేకుండా చూడాలని, బ్లీచింగ్ పౌడర్, గ్యాంబూషియా చేపల వాడకంపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే, తాగునీటి మైనార్టి పరీక్షలు, ఫీవర్ సర్వేలు, హెల్త్ క్యాంపులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో ఔషధాలు, పరీక్షలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ ఆసుపత్రులు కూడా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని చెప్పారు. ఇంతే కాక, ఆయా మండల వైద్యాధికారులు ప్రతి వారానికి నివేదికలు పంపించాలని, అత్యవసర పరిస్థితుల్లో తక్షణం స్పందించేలా రెస్పాన్స్ టీమ్స్ సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్ రెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్లు, వడ్డ బోయిన శ్రీనివాస్, రామకృష్ణ, హెచ్ఈఓ కేలన్ స్వామి, రాపిడ్ రెస్పాండ్ స్టీమ్ హెల్త్ ఎడ్యుకేటర్ పురుషోత్తం, కె వి రాజు హెల్త్ ఎడ్యుకేటర్, వైద్య సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో "అమ్మ మాట - అంగన్వాడి బాట" కార్యక్రమంపై సమీక్ష



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జూన్ 10 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి "అమ్మ మాట - అంగన్వాడి బాట" కార్యక్రమంపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల పనితీరు, పిల్లల నమోదు, మరియు కార్యక్రమ ప్రచార పద్ధతులపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలు పిల్లల సమగ్ర అభివృద్ధికి పునాదులని, వాటి ప్రాముఖ్యతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ నెల జూన్ 10 నుండి 17వ తేదీ వరకు జిల్లాలోని ప్రతి గ్రామంలో "అమ్మ మాట - అంగన్వాడి బాట" కార్యక్రమంపై విస్తృత ప్రచార ర్యాలీలు, గ్రామాలలో టాం టాం లు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా సంక్షేమ ఆధికారి శ్రీమతి మల్లీశ్వరి మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ టీచర్ తమ పరిధిలోని పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు వచ్చేలా ప్రోత్సహించాలని, అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లల తల్లిదండ్రులకు అంగన్వాడీ కేంద్రాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి, వారిని చైతన్యపరచాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో మహదేవపూర్ సిడిపిఓ శ్రీమతి రాధిక మరియు ఇతర సూపర్వైజర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూపర్వైజర్లకు కార్యక్రమ అమలుపై తగిన దిశానిర్దేశం చేశారు.

# జాతీయ లోక్ అదాలత్లో పెద్ద కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్. రమేష్ బాబు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జూన్ 10 (తీన్మార్ న్యూస్): జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అన్ని కోర్టు ప్రాంగణాల్లో జూన్ పద్నాల్గవ తారీఖున జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్. రమేష్ బాబు తెలిపారు. మంగళవారం పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతు రాజి మార్గాన్ని ఎంచుకొని వివాదరహిత జీవితాలను గడిపే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కేసుల్లో రాజీపడితే ఇరువర్గాలకు మంచిదని అన్నారు. పెద్ద ఎత్తున కేసుల పరిష్కారానికి కృషి చేయాలనీ వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి ఏ. నాగరాజు, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. ఆర్. దిలీప్ కుమార్ నాయక్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల, జిల్లా అడిషనల్ ఎస్.పి. నరేష్ కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, డి.ఎస్.పి సంపత్ రావు, సర్కిల్, సబ్ ఇన్స్పెక్టర్లు మరియు కోర్టు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

# నిత్యావసర వస్తువుల పంపిణీలో పారదర్శకత ఉండాలి

### రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జూన్ 10 (తీన్మార్ న్యూస్): నిత్యావసర వస్తువుల పంపిణీలో పారదర్శకత మరియు జవాబుదారీతనం ఉండాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం కాటారం మండలం లోని గారెపల్లి, ధన్వాడ గ్రామాల్లో చౌక ధరల దుకాణాలు ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగాఅదనపు కలెక్టర్ స్టాక్ పరిశీలించి లబ్ధిదారులతో సంభాషించారు. చౌక ధరల దుకాణాలు సమర్థవంతంగా పనిచేయాలని లబ్ధిదారులు ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్డులు కలిగిన ప్రతి కుటుంబానికి నిత్యావసర వస్తువుల పంపిణీ జరగాలని ఆయన ఆదేశించారు. లబ్ధిదారులు లేవనెత్తిన ఏవైనా సమస్యలు లేదా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. చౌక దుకాణాల పనితీరును పర్యవేక్షించడం మరియు పిడీఎస్ ప్రయోజనాలు పారదర్శకంగా మరియు సమర్థవంతంగా ఉద్దేశించిన లబ్ధిదారులకు చేరేలా చూడటం కోసం నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో అత్యున్నత ప్రమాణాలతో విద్యా బోధనలు

**పండుగ వాతావరణంలో పాఠశాలలు పునర్ ప్రారంభించారు**

**మనఊరు - మనబడి కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలి**

**ఎడ్యుకేషన్, హెల్త్ న్యూట్రిషన్, సానిటేషన్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**



మహబూబాబాద్ జిల్లా, జూన్ 10 (తీన్మార్ న్యూస్): మంగళవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి అధ్యక్షతన విద్యాశాఖ పై సమీక్ష సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎడ్యుకేషన్, హెల్త్, సానిటేషన్, న్యూట్రిషన్ లపై ప్రత్యేక దృష్టి పెట్టి విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధనలు, ఆరోగ్యం న్యూట్రిషన్ అందించాలనీ, సూచించినందున, జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యా బోధనలు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో తరగతులు సబ్జెక్టుల వారిగా నిర్వహించడం జరుగుతుందని స్వచ్ఛమైన ఆహారం అందించడం జరుగుతుందన్నారు, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను క్షేత్రస్థాయిలో తల్లిదండ్రులకు పిల్లలకు తెలియపరచి 100% ప్రభుత్వ పాఠశాలలో చేరి విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలలు వేసవి సెలవుల అనంతరం పునర్ ప్రారంభం అవుతున్న సందర్భంగా ఒక పండగ వాతావరణం లో పాఠశాలలు ప్రారంభించాలని పరిసరాలను పరిశుభ్రంగా సానిటేషన్ చేయాలన్నారు. వేసవి సెలవులు ప్రధానోపాధ్యాయులకు సబ్జెక్టు టీచర్లకు ఫిజికల్ డైరెక్టర్లకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి పిల్లలకు మంచి విద్య బోధనలు అందించేందుకు ఉపాధ్యాయులను తీర్చిదిద్దడం జరిగిందన్నారు. రాష్ట్రంలోనే జిల్లా విద్యాశాఖ మొదటి స్థానంలో నిలిచినందున అందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరూ వచ్చే ఏడాదిలలో అదేవిధంగా ముందస్తు ప్రణాళికలతో సాగాలని అన్నారు. ఈ సమీక్షలో మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులపై అనేక ముఖ్యమైన అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు, బడి బాట ప్రగతిపై నివేదిక: రోజువారీ అడ్మిషన్ డేటా, పాఠశాలవారీగా విద్యార్థుల నమోదు ఆదేశించారు. అంగన్‌వాడీ నుండి విద్యార్థుల నమోదు: కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత పాఠశాలల్లో అంగన్‌వాడీల నుండి విద్యార్థులందరినీ మన ప్రాథమిక పాఠశాలలో జాయిన్ చేయాలని ఆదేశించారు. జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలు: మండలాల్లోని జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాలల వివరాలు, ఇప్పటికే ప్రారంభించినవి, త్వరలో ప్రారంభించబోయేవి గురించి ఏ రకమైన ప్రణాళికల ద్వారా ఆ పాఠశాలలను పున ప్రారంభించాలని కోరారు, ఇంటర్మీడియట్ అడ్మిషన్ వివరాలు: పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థుల ఇంటర్ కాలేజీలలో అడ్మిషన్ వివరాలు, ఇంకా నమోదు కాని విద్యార్థుల వివరాలను ఇంటర్మీడియట్ విద్యాశాఖ వారికి అందజేసి అందరు విద్యార్థులు ప్రభుత్వం జూనియర్ కళాశాలలో జాయిన్ అయ్యేవిధంగా ప్రోత్సహించాలని ఆదేశించారు. గ్రాండ్ పేటీఎం %డ% పాఠశాల పరిశుభ్రత: జూన్ 12న నిర్వహించబోయే గ్రాండ్ పేటీఎం యొక్క యాక్షన్ ప్లాన్, పాఠశాలలు శానిటేషన్ వాటర్ ఫెసిలిటీ సివిల్ వర్క్స్ ఎలక్ట్రిఫికేషన్ అన్ని తరగతుల పరిశుభ్రం చేయాలన్నారు, విద్యార్థుల నమోదు పెంపు, నాణ్యత గల విద్యాప్రభుత్వ పాఠశాలలో ఉచిత మధ్యాహ్న భోజన పథకం, టెక్స్ట్ పుస్తకాలు, లతో పాటు నాణ్యమైన గుణాత్మక విద్యాబోధన జరుగుతుందని ప్రభుత్వ పాఠశాలపై నమ్మకం కలిగేలా పాఠశాలలన్నిటిని మన వసతులను సౌకర్యాలను తల్లిదండ్రులకు చూపించాలని అవగాహన కల్పించారని, ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలో ఉచిత మధ్యాహ్న భోజన పథకం, టెక్స్ట్ పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫార్మ్ లతో పాటు నాణ్యమైన గుణాత్మక విద్యాబోధన జరుగుతుందని ప్రభుత్వ పాఠశాలపై ప్రజలందరికీ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మహంకాళి బుచ్చయ్య, డి సి బి సెక్రటరీ బాలాజీ, డిస్టిక్ సైన్స్ ఆఫీసర్ అప్పారావు, కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆజాద్, ప్లానింగ్ కోఆర్డినేటర్ పూర్ణచందర్, ఏసీ సంతోష్, డి సి బి అసిస్టెంట్ సెక్రటరీ సతీష్ , ముజాహిద్, పాల్గొన్నారు.

## బిఎస్ఎస్ లో జిల్లా ఉపాధ్యక్షుడిగా మారపల్లి విజయ్ కుమార్

**శాయంపేట మండల అధ్యక్షునిగా మారేపల్లి సుధాకర్**

**ఫౌండర్ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో నియామకం**





హనుమకొండ, జూన్ 10 (తీన్మార్ న్యూస్): బహుజన సంక్షేమ సంఘం (బిఎస్ఎస్) హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా మారపల్లి విజయ్ కుమార్ మరియు శాయంపేట మండల అధ్యక్షునిగా మారేపల్లి సుధాకర్ (డాన్) లను వ్యవస్థాపక అధ్యక్షులు మారపల్లి క్రాంతి కుమార్, మరియు ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మొగ్గం సుమన్ ల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా విజయ్ కుమార్, మరియు సుధాకర్ లు మాట్లాడుతూ మేము చేస్తున్న ప్రజా ఉద్యమాలను గుర్తించి బి ఎస్ ఎస్ లో బాధ్యతలను అప్పజెప్పినందుకు అధ్యక్షులు మారపల్లి క్రాంతి కుమార్, మరియు మొగ్గం సుమన్ లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. మాపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పజెప్పినందుకు సంఘం యొక్క నియమాలను పాటిస్తూ క్రమశిక్షణతో ప్రజా ఉద్యమాలలో విద్యార్థి ఉద్యమాలలో మా వంతు పాత్రను నిర్వహిస్తూ ముందుంటామని మా ఎన్నికకు సహకరించిన బి ఎస్ ఎస్ సంఘానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం అని అన్నారు.

## సహాయ ఉపకరణముల కొరకు దరఖాస్తులు ఆహ్వానం



జనగామ జిల్లా, జూన్ 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం వికలాంగులు, వయోవృద్ధులు ట్రాన్స్ జెండర్ వ్యక్తుల సాధికారిత శాఖ, తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ ద్వారా జిల్లాలోని వికలాంగులకు సహాయ ఉపకరణాలు మంజూరు చేయడం కొరకు గాను 2024-25 ఆర్థిక సంవత్సరమునకు గాను జనగామ జిల్లాకి కేటాయించిన పరికరాల వివరాలు రెట్రోఫీటెడ్ మోటర్ వెహికల్స్(38), బ్యాటరి వీల్ చైర్(11), మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రై సైకిల్(15), బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో వెహికల్స్ , (1) హైబ్రిడ్ వీల్ చైర్ అటాచ్మెంట్ ప్లస్, (4) లాప్ టాప్(డిగ్రీ స్టూడెంట్)(13), లాప్ టాప్ ( హయ్యర్ ఎడ్యుకేషన్/ టెక్నికల్ ఎడ్యుకేషన్) (5), టాబ్స్(10), 5 జి స్మార్ట్ ఫోన్లు(2), మరియు మూడు చక్రాల రిక్షా(5), సాదారణ వీల్ చైర్(5), సంక కర్రలు(19), శ్రవణ యంత్రాలు (హియరింగ్ ఎడ్స్)(2), చేతి కర్రలు(19), స్మార్ట్ కెన్(10), MCR చెప్పల్(10) వంటి సహాయ ఉపకరణములను ఉచితంగా పంపిణీ చేయుటకు దరఖాస్తులను కోరనైనది.

కావున అర్హత కలిగిన దివ్యాంగులు https://tgobmms.cgg.gov.in ఆన్లైన్ ద్వారా తమ దరఖాస్తులు సమర్పించాలి దరఖాస్తు సమర్పణకు 07-06-2025 నుండి 18-06-2025 వరకు ఆన్లైన్ ద్వారా మాత్రమే అవకాశం ఉంటుంది, ప్రతి దరఖాస్తులకి ఒక సహాయ ఉపకరణ మాత్రమే మంజూరు చేయబడును కావున దరఖాస్తుదారులు అవగాహనతో జాగ్రత్త తీసుకొని తమ దరఖాస్తులు ఆన్లైన్లో మాత్రమే చేసుకోవాలి అని తెలుపుతున్నాము. ఇతర వివరాలకై జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ జనగామని అన్ని కార్యాలయ పనివేలళలో సంప్రదించగలరని మరియు దివ్యాంగుల టోల్ ఫ్రీ నెంబర్ 155326 కి సంప్రదించగలరని తెలియజేయడమైనది. ఇట్టి సదవకాశాన్ని వినుయోగించుకోవలసినదిగా డి. ఫ్లోరెన్స్, జిల్లా సంక్షేమ అధికారిణి, మహిళలు పిల్లలు దివ్యాంగుల మరియు వయోవృద్దుల సంక్షేమ శాఖ, జనగామ జిల్లా వారు తెలియజేయడం జరిగినది.

## పాకాల ఎకో టూరిజంగా అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**పాకాల సరస్సు, పరిసర ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్**



వరంగల్ జిల్లా, జూన్ 10 (తీన్మార్ న్యూస్): పాకాలను ఎకో టూరిజంగా మరింత అభివృద్ధి చేయుటకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లా అటవీ శాఖ అనూజ్ అగర్వాల్ తో కలిసి క్షేత్రస్థాయిలో నర్సంపేట రేంజ్ లోని పాఖాలలో గ్రీన్ హెరిటేజ్ క్రింద అభివృద్ధి చేసిన బయోడైవర్సిటీ పార్కును, బట్టర్, ట్రిక్కింగ్, సైక్లింగ్, పగోడాలను పరిశీలించిన అనంతరం కలెక్టర్ పాకాల సరస్సులో బోటింగ్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటకులకు ఆకర్షించే విధంగా పాకాల సరస్సు పరిసర ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయుటకు పటిష్టమైన ప్రణాళికలు రచించాలని డీఎఫ్ఓకు సూచించారు. అందులో భాగంగా బయోడైవర్శిటీ పార్క్ ను మరింత అభివృద్ధి పరచడం, పర్యావరణ పర్యాటక అభివృద్ధి చేయాలని, సఫారీ ట్రాక్ ఏర్పాటు, మూలికల తోట పునరుద్ధరణ, సందర్శకులకు రాత్రి బస సౌకర్యాల అభివృద్ధి, చెరకు ప్యాచ్ అభివృద్ధి, పర్యావరణ పర్యాటక సంబంధిత కార్యకలాపాలకు సంబంధించిన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ ఆర్ ఓ రవి కిరణ్, డిప్యూటీ ఎఫ్ఆర్ఓ, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమం



ఏటూరునాగారం, జూన్ 10 (తీన్మార్ న్యూస్): శంకరాజ్ పల్లి ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో డి. సంజీవరావు జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో ఉద్యాన పంటల సాగు అంతర్ పంటల మిశ్రమ పంటల సాగు ఆవశ్యకత ఆయిల్ పామ్ తోటలకు రాయితీ వివరాలు పోడుపట్టాలు కలిగిన ఎస్టీ రైతులకు ఇందిర సౌర గిరి జలవికాసం పథకం దాని రాయితీ గురించి తెలియజేయడం జరిగినది. ఆయిల్ పామ్ ఎకరానికి రాయితీ మొక్కలపై రూపాయలు 11,500 అంతర్ పంటలకు యాజమాన్యంపై 16,800 రూపాయలు నాలుగు సంవత్సరాలకు మరియు చిందు సేద్య పరికరాలపై రూపాయలు 22,518 మొత్తంగా ఎకరానికి 50,918 రూపాయలు రాయితీ ఈ ప్రభుత్వం అందిస్తుంది. డ్రిప్ పై రాయితీ ఎస్సీ, ఎస్టీ రైతులకు 100% చిన్న సన్నకారు రైతులకు 90% ఇతర రైతులకు 80% ఉంటుంది. సమగ్ర ఉద్యాన పంటల అభివృద్ధి పథకంలో మామిడి అరటి బొప్పాయి, జామ, డ్రాగన్ ఫ్రూట్ పంటలకు 50 శాతం రాయితీ పందిళ్ళపై తీగజాతి కూరగాయలను సాగు చేయవచ్చును. ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం డివిజన్ ఉద్యాన అధికారి కోపిరి లావణ్య ఆయిల్ ఫామ్ కంపెనీ ప్రతినిది దుగ్గి అఖిల్ ఫినోలెక్స్ డిప్ కంపెనీ ప్రతినిది రోహిత్ రైతులు విజయ్ కుమార్, ప్రవీణ్ కుమార్, జాడి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లుకు భూమి పూజ

**కార్యక్రమంలో పాల్గొన్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**



వరంగల్, జూన్ 10 (తీన్మార్ న్యూస్): గ్రేటర్ వరంగల్ 17వ డివిజన్ పరిధిలోని వసంతాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లుకు భూమి పూజ కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి ఇంటినిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా 93 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరి పత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తాం అని అన్నారు. ప్రజల యొక్క కుటుంబ ఆర్థిక పరిస్థితులు అభివృద్ధి చేయాలి అనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.నియోజకవర్గ వ్యాప్తంగా 3500 ఇందిరమ్మ ఇండ్లు,కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ లో భూములు కోల్పోయిన బాధితులకు 863 ఇండ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. పేదింటి సొంత కళ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోనే సాధ్యమవుతుంది, గత ప్రభుత్వ పాలకుల నిర్వాహకం వల్ల ధనిక రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని అన్నారు. భారత దేశంలోనే రూ.5 లక్షలతో నిరుపేదల సొంతింటి కల నెరవేర్చే ఏకైక పథకం అని అన్నారు.ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ఉచిత బస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 రూ గ్యాస్ సిలిండర్, సన్నవడ్లకు రూ 500 బోనస్, గురుకుల పాఠశాలల విద్యార్థులకు డైట్ చార్జీల పెంపు, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు.

## ప్రజలు లేకుండానే చాటుమాటున ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలు

**లబ్ధిదారుల ఎంపిక గ్రామ సభ ద్వారానే జరగాలి**



శాయంపేట (తీన్మార్ న్యూస్) జూన్ 10: మంగళవారం శాయంపేట ఎంపీడీవో కార్యాలయం ముందు గ్రామసభ ద్వారానే ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ జరగాలని బహుజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మారపల్లి క్రాంతి కుమార్ బహుజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ గ్రామ సభ ద్వారా నిర్వహించకుండా, ఇష్టం వచ్చిన రీతిలో ఎంపిక ప్రక్రియ చాటుమాటున ఎందుకు ఎంపిక చేశారని ఎంపీడీవోని అడగగా ఈ ఎంపిక ప్రక్రియతో మాకు సంబంధం లేదు అది ప్రభుత్వం తీసుకున్నటువంటి నిర్ణయం అని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందని అన్నారు. మీరు ఏదైనా అడగాలి అని అనుకుంటే ప్రభుత్వాన్ని అడగండి అని మా దగ్గర కాదు అని చెప్పడం పట్ల ఆయన విధుల పట్ల ఎంత నిజాయితీగా ఉన్నాడో అర్థం చేసుకోవచ్చని క్రాంతికుమార్ అన్నారు. అదేవిధంగా ఈ ప్రభుత్వం ప్రజా పాలన ప్రభుత్వం ఈ ప్రభుత్వంలో పేదలకు న్యాయం జరుగుతుందని, ఈ ప్రభుత్వం పేదల పక్షపాతి అని, ప్రజలు చాలా ఆశగా ఉన్నారు, కానీ దానికి భిన్నంగా భూపాలపల్లి నియోజకవర్గంలోని శాయంపేట మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ఎలా జరిగింది అని అధికారులని అడిగితే పైన కమిటీ వాళ్ళని అడిగితే అధికారుల పైన ఒకరిపై ఒకరు చెబుతూ పేద ప్రజలకు అన్యాయం జరిగే విధంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రజా పాలనకు వ్యతిరేకంగా గ్రామసభల ద్వారా ఎంపిక జరగకుండా ఉండడాన్ని నిరసిస్తూ శాయంపేట ఎంపీడీవో కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేయడం జరిగింది,

ఇప్పటికైనా మొన్న జరిగినటువంటి ఎంపికను గ్రామసభ నిర్వహించి గ్రామ ప్రజల ఆమోదం చేత లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. పేద ప్రజలకు అన్యాయం జరిగితే పోరాటాలను ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా డిమాండ్ చేయడం జరిగింది. ఇట్టి నిరసనను పోలీసుల జోక్యంతో శాంతింపజేసి ఎంపీడీవో కి వినతి పత్రం ఇప్పించడం జరిగింది, దీనికి ఎంపీడీవో పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బహుజన సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మొగ్గం సుమన్, మారపెల్లి విజయ్, మారపెల్లి సుధాకర్, మొగ్గం వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



# కలెక్టర్ మా గ్రామానికి రావాలి

**ఇంచెంచెర్వుపల్లి రోడ్డు దుస్థితి చూడాలి**

**ఈ రోడ్డు పై వెళ్లాలంటే యముని దగ్గరకు వెళ్లొచ్చినట్టే**

**రోడ్డును తోవ్వి కంకర వేసి వదిలేన కాంట్రాక్టర్**

**పంచాయతీరాజ్ డిఈ లింగారెడ్డి ఇచ్చిన వివరణకు నిరసన**

**రోడ్డు పై బైఠాయించి నిరసన తెలిపిన గ్రామ ప్రజలు**




వెంకటాపూర్, జూన్ 10 (తీన్మార్ న్యూస్): ఇంచెంచెర్వుపల్లి గ్రామానికి వెళ్లాలంటే 'యముని దగ్గరకు వెళ్లొచ్చినట్టే' అని గ్రామ ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి నుండి కేవలం 4 కి.మీ. దూరంలో ఉన్న ఈ గ్రామానికి చేరుకోవాలంటే ప్రజలు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. రోడ్డు పనులను అసంపూర్తిగా వదిలేసిన కాంట్రాక్టర్‌పై, అలాగే అధికారుల నిర్లక్ష్యంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనుల్లో తీవ్ర జాప్యం. గ్రామానికి రోడ్డు నిర్మాణ పనుల కోసం నిధులు మంజూరైనప్పటికీ, కాంట్రాక్టర్ ఇతర పనులపై దృష్టి సారించడంతో మూడు నెలలుగా రోడ్డు పనులు నిలిచిపోయాయి. రోడ్డు పక్కలకు మొరం పోయకుండా, కంకర వేసినా రోడ్డు రోలర్‌తో తొక్కకుండా వదిలేశారు. దీని వల్ల ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు పక్కకు దిగడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు తరచుగా ప్రమాదాలకు గురై నడుములు విరగొట్టుకుంటున్నారని, ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉన్నా అధికారులు, కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు మండిపడుతున్నారు.


పంచాయతీరాజ్ డిఈ లింగారెడ్డి వివరణపై నిరసన

పంచాయతీరాజ్ డిఈ లింగారెడ్డి ఇచ్చిన వివరణకు నిరసనగా గ్రామ ప్రజలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కాంట్రాక్టర్ వేరే పనుల్లో నిమగ్నమయ్యాడని డిఈ చెప్పడంపై గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించారు. "అలాంటప్పుడు ఆ కాంట్రాక్టర్‌కు పనులు ఎందుకు ఇచ్చారు? మీరు ఏం చేస్తున్నారు?" అంటూ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించారు.


**కలెక్టర్‌కు విజ్ఞప్తి**

ఇంచెంచెర్వుపల్లి రోడ్డు పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, అంబులెన్స్ రావాలన్నా, గర్భిణులు వెళ్లాలన్నా, అత్యవసర పనులకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామ ప్రజలు ఈ సందర్భంగా కలెక్టర్ కి విజ్ఞప్తి చేశారు. తమ గ్రామంపై దృష్టి సారించి, రోడ్డు పనులను సత్వరమే పరిశీలించి, కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్డు వేయాల్సిందిగా కోరుచున్నారు. ఈ విజ్ఞప్తి గ్రామ ప్రజలందరి తరపున అని తెలియజేశారు.





# అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షా: పిసిసి చీఫ్



**హైదరాబాద్, జూన్ 10:** పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అమిత్ షా అవమానించారని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చాలని బిజెపి ప్రయత్నిస్తోందని ఆయన పేర్కొన్నారు. షాద్‌నగర్‌లో నిరసన కాలర్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజ్యాంగం పరిరక్షణే ధ్యేయంగా 'జై బాపు జై భీమ్ జై సంవిధాన్' కార్యక్రమాలు చేపట్టామని ఆయన తెలిపారు. దేశ సమగ్రతకు తూట్లు- పొడిచే విధంగా ప్రధాని, అమిత్ షాలు వ్యవహారిస్తున్నారని ఆయన మండిపడ్డారు. అధికారమే పరమావధిగా అధికారం లేకుంటే బ్రతకలేమన్న విధంగా బిజెపి నేతలు వ్యవహారిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ స్వలాభం కోసం బిజెపి నేతలు కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి దేశాన్ని విచ్చినం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. దేశ విచ్చిన్న శక్తుల కుట్రలను తిప్పికొట్టేందుకు ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పిలుపు మేరకు గల్లీ నుంచి ఢిల్లీ వరకు 'జై బాపు జై భీమ్ జై సంవిధాన్' కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించినట్టు- ఆయన తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉండి కూడా చేసిన అభివృద్ధి గురించి చెప్పుకోలేని స్థితిలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉందన్నారు. 400 సీట్లు- వస్తాయని నమ్మ బలికిన బిజెపి నేతలకు ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెపారని అయినా వారిలో మార్పు రాలేదని ఆయన ఎద్దేవా చేశారు. పిసిసి కార్యవర్గంలో 70 శాతం మేరకు బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చోటు- కల్పించి సామాజిక న్యాయానికి, మహిళలకు పెద్దపీట వేశామన్నారు.

## భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**పరిష్కారంపై ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్ష**



హనుమకొండ జిల్లా, జూన్ 10 (తీన్మార్ న్యూస్): జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న భారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆర్డీవోలు, తహసీల్దార్లను ఆదేశించారు. హనుమకొండ జిల్లాలోని మండలాల్లో జరుగుతున్న భూభారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణ, వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రతి దరఖాస్తు ను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అప్లికేషన్లను భూభారతి పోర్టల్ లో ఆన్లైన్ చేయాలన్నారు. వచ్చిన సాదా బైనామా అప్లికేషన్లను విచారించి సిద్ధంగా ఉంచాలన్నారు. భూభారతి సదస్సులలో వచ్చిన అప్లికేషన్లను పరిష్కరించే చర్యల్లో భాగంగా తగినంత సిబ్బందిని కేటాయించాలన్నారు. ప్రతి అప్లికేషన్ను భద్రంగా భద్రపరచాలన్నారు. అప్లికేషన్ తో పాటు దరఖాస్తుదారులు సమర్పించిన ఆధారాలను సరిచూసుకొని పరిష్కారానికి తదుపరి చర్యల నిమిత్తం పంపించాలన్నారు. వచ్చిన దరఖాస్తులలో కేటగిరీలుగా విభజించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి, భూమి కొలతలు శాఖ ఏడీ శ్రీనివాసులు, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## దిశా సర్వసభ్య సమావేశం. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూన్ 10 (తీన్మార్ న్యూస్): గురువారం 12వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు ఐ డి ఓ సి కార్యాలయం లో దిశా కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. దిశా కమిటీ చైర్మన్, ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘురామిరెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి కో చైర్మన్ మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, జిల్లాకు చెందిన శాసనమండలి, శాసనసభ్యులు దిశా కమిటీ సభ్యులు మరియు అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొననున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు తమ శాఖలలో చేపడుతున్న పనుల పై నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని అధికారులను ఆదేశించారు.

## ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయ టర్మ్ ఎండ్ పరీక్షలు జూన్ 12 నుండి ప్రారంభం

వరంగల్, జూన్ 10 (తీన్మార్ న్యూస్): ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) దేశ వ్యాప్తంగా జూన్, 2025 టర్మ్ ఎండ్ ఎగ్జామినేషన్స్ ను 12 జూన్, 2025 నుండి 19 జూలై, 2025 వ తేదీ వరకు నిర్వహించుతున్నదని వరంగల్ లాల్ బహదూర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ డి.హెచ్. రావు మరియు ఇగ్నో అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ యస్. వి. రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ మరియు పీజి విద్యార్థులతో పాటుగా డిప్లొమా, పీజి డిప్లొమా మరియు సర్టిఫికెట్ ప్రోగ్రాములకు సంబంధించిన విద్యార్థులకు ఈ పరీక్షలు వరంగల్ లోని లాల్ బహదూర్ కళాశాల పరీక్ష కేంద్రంలో నిర్వహించబడుతాయని ఇగ్నో హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం సీనియర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కే. రమేష్ మరియు అసిస్టెంట్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ బోళ్ల రాజు సంయుక్తంగా పేర్కొన్నారు. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టిక్కెట్లను ఇగ్నో వెబ్ సైట్ %షష.అస్త్రఅశీబ.ఖఎ.అఅ% నుండి డౌన్లోడ్ చేసుకోవాలని వారు సూచించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు నిర్ణీత సమయం కన్నా ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించినారు. పరీక్షా కేంద్రంలోకి ఏవిధమైన మొబైల్ ఫోన్స్ మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసురావద్దని అలాగే విద్యార్థులు విధిగా కోవిడ్-19 నిబంధనలను పాటించవలెనని వారు పేర్కొన్నారు. ఇతర పూర్తి వివరాలకు అభ్యర్థులు 98493 81085 ఫోన్ నెంబర్ లో సంప్రదించగలరని తెలిపారు.

## స్నేహ జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశము




వరంగల్ జిల్లా, జూన్ 10 (తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం స్నేహ జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశము నిర్వహించడమైనది. ఈ మీటింగ్ కి డాక్టర్ జలాలం యూనిసెఫ్ చీఫ్ ముఖ్య అతిథులుగా రాగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన సీనియర్ అడ్వైజరీ జెండర్ సర్ఫ్ హైద్రాబాదు నుండి జమున మరియు సంబంధిత జిల్లా అధికారులతో ఈ స్నేహ కమిటీ మీటింగ్ నిర్వహించడమైనది. వరంగల్ జిల్లాలో చేపట్టిన స్నేహ కార్యక్రమము మరియు జిల్లా కలెక్టర్ ప్రభుత్వ స్కూల్స్ లో ప్రతి శనివారం నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమం ద్వారా విద్యార్థినీ విద్యార్థులకు రిటైర్డ్ హెడ్ మాస్టర్ లతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో హాస్టల్స్ లో కంప్లైంట్స్ బాక్స్ ఏర్పాటు చేసి విద్యార్థుల సాధకబాధకాలు తెలుసుకొని పరిష్కరించడంలో జిల్లా కలెక్టర్ కృషి కి అభినందించారు. జిల్లాలో స్నేహ కార్యక్రమాల తీరు పై కమిటీ మెంబెర్స్ అయిన సంబంధిత అధికారులతో అభిప్రాయాలు తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కమిటీలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, అడిషనల్ ఎస్పీ, జిల్లా పంచాయతీ రాజ్ అధికారి, డిస్టిక్ రీజినల్ కోఆర్డినేటర్ ఇంటర్నెట్ బోర్డ్ అధికారి, డిస్ట్రిక్ట్ స్కిల్ ట్రైనింగ్ ఆఫీసర్ , జిల్లా మెక్మా అధికారి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి, జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి, యూత్ వెల్ఫేర్ ఆఫీసర్లు కమిటీ మెంబర్లు గా ఉంటారని వారు స్నేహ కార్యక్రమంపై వారి వారి శాఖల విధివిధానాలతో పాటు స్నేహ కార్యక్రమంలో భాగంగాఅన్ని శాఖల అధికారులతో అడల్సేంట్ బాలికలకి సంబంధించి అవేర్నెస్ కార్యక్రమాలు జరుగుతున్న వివిధ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్నేహ పిల్లల సంఘాలు మహిళా సంఘాలు మరియు వయోవృద్ధుల సంఘాలు ఒకదానికొకటి అనుసంధానంగా పనిచేసేలా చేయాలని తల్లిదండ్రులకు పిల్లల విద్యా ప్రమాణాలతో పాటు ఆరోగ్య ప్రమాణాలు కూడా తెలిసే విధంగా చర్యలు తీసుకోవాలని రెండో విడతలో ఈ స్నేహ కార్యం క్రమాన్ని మరింత పటిష్టంగా ముందుకు తీసుకు వెళ్ళుటకు ప్రణాళికలు సిద్ధం చేయాలని స్నేహ కమిటీల సభ్యులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి స్నేహ కార్యక్రమం బలోపేతానికి మహిళా సంఘాలు, మండల స్థాయిలో మరియు గ్రామస్థాయిలో భాగస్వామ్యం చేయాలని పెద్ద వయస్సు వృద్ధుల తో సంఘాలు ఏర్పాటు చేయాలని జమున పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిఆర్డీఓ పిడి కౌసల్య దేవి మాట్లాడుతూ స్నేహ కార్యక్రమం ప్రగతి వివరాలు తెలియజేస్తూ 286 గ్రామాలలో 338 గ్రామాలలో 338 సంఘాలు 3207 మంది బాలికలతో ఏర్పాటు చేసి సంఘాల లీడర్లకు శిక్షణ ఇప్పించి వేసవి సెలవుల కార్యక్రమం వేడుకల గురించి అదే విధంగా రెండో విడత చేయబోయే కార్యక్రమాల గురించి తెలియజేశారు. సోషల్ యాక్షన్ కమిటీలు స్కూళ్లను సందర్శించి పిల్లలకు అవగాహన కల్పించాలని ప్రొటెక్షన్ ఆఫీసర్ మురళి సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,పీఎం హెచ్ డి సరిత, లింగం గౌడ్, అడిషనల్ డి ఆర్ డి ఓ, డి పి ఎం మరియు జిల్లా ఏపీఎంలు పాల్గొన్నారు.



# అక్షర సంకల్పానికి తూట్లు!

ప్రతి ఆవాసంలోనూ స్కూలు పెట్టి పిల్లలకు విద్యను చేరువ చేయాలన్న సంకల్పంతో ఏర్పాటు చేసిన ఏకోపాధ్యా పాఠశాలలు కనుమరుగు అయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలను ఓ క్రమపద్ధతిలో ప్రైవేట్ పాఠశాలలు మింగేశాయి. దీంతో మారుమూల గ్రామాల ప్రజలకు ప్రైవేట్ స్కూళ్లు దిక్కయ్యాయి. వారు మెల్లగా గ్రామాలకు బస్సులను పెట్టి, మండల కేంద్రాల్లో స్కూళ్లు పెట్టి, అందమైన బొమ్మలు చూపి ముగ్గులోకి దించుతూ వచ్చారు. ఇలాగత దశాబ్దకాలంగా ప్రైవేట్ స్కూళ్ల విజృంభణతో ప్రభుత్వ పాఠశాల లు కనుమరుగు అయ్యాయి. ఉమ్మడి ఎపిలో ఇలా అనేక స్కూళ్లు మూతపడ్డాయి. రాష్ట్ర విభజన తరవాత కూడా పాలకులు ఇదే ధోరణి అవలంబించడంతో అనేక పాఠశాలలు మూతపడ్డాయి. డిఎస్సీల గొడవ, జీతాల గొడవ లాంటివి లేకుండా చేసే కుట్రలో భాగంగా అనేక స్కూళ్లను మూసేశారు. ఘనత వహించిన తెలంగాణలో కెసిఆర్ సర్కార్ ఈ విషయంలో వడివడిగా అడుగులు వేసింది. అందుకే విద్యారంగంలో తీసుకున్న చర్యలు క్షేత్రస్థాయిలో ఎలాంటి ప్రభావం చూపలేదు. పేదలకు విద్య అందించాలన్న ఆలోచన లేకుండా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకున్నాయి. ఇంగ్లీష్ మీడియం ఆశ చూపి స్కూళ్ల విలీనంతో చిన్నపిల్లలు తమ సమీప స్కూళ్లకు వెళ్లే అవకాశం కోల్పోయేలా చేసిన ఘనతను నాటి సిఎం జగన్ సాధించారు. ఒకప్పుడు విద్యను గ్రామస్థాయికి తీసుకుని వెళ్లాలన్న సంకల్పంతో ఏకోపాధ్యాయ పాఠశాలలను ప్రారంభించారు. చిన్న గ్రామానికి కూడా స్కూలు ఉండాలన్న సంకల్పం వచ్చింది. అక్కడ ఒక్కరే టీచర్‌ను నియమించి నడిపించారు. దీంతో అనేక గ్రామాల్లో ఏకోపాధ్యాయ స్కూళ్లు ఏర్పడ్డాయి. తల్లిదండ్రులు తమపిల్లలను ఉన్న ఊర్లోని స్కూలుకు పంపడం వల్ల అక్షరజ్ఞానం వచ్చింది. ఇది అక్షరాస్యతకు తోడ్పడింది. అక్షరాస్యతను పెంచే క్రమంలో ఇదో విప్లవాత్మక చర్యగా చూడాలి. ఈ లక్ష్యం దెబ్బతినకుండా ప్రభుత్వాలు మరింత పకడ్బందీగా విద్యావ్యవస్థను అమలు చేయాల్సింది పోయి వాటిని మూతేశారు. ప్రభుత్వాలు జీతాల భారం తగ్గించుకునే క్రమంలో స్కూళ్ల విలీనం చర్యలకు పూనుకున్నాయి. దీనివల్ల సామాన్యులకు ప్రభుత్వ విద్య దూరం అయ్యింది. ఇది కూడా కార్పోరేట్ కుట్రలో భాగమే అని చెప్పాలి. వారు వెనకవుండి ఆడించిన కారణంగానే ప్రభుత్వాలు ఈ చర్యలకు దిగాయి. ఈ సమస్యను అర్థం చేసుకోకుండా ప్రాథమిక పాఠశాలలను.. ప్రాథమి కోన్నత, ఉన్నత విద్యాపాఠశాలల్లో విలీనం చేసారు. గతంలో పాలించిన జగన్ నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పై విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర నిరసన వ్యక్తం అయ్యింది. మా పాఠశాలను వేరే పాఠశాలలో విలీనం చేయవద్దంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేశారు. నిజానికి ప్రతి గ్రామానికి పాఠశాల ఉండాలన్న సంకల్పం దెబ్బతనికుండా చూడాల్సిన ప్రభుత్వం విలీనం పేరుతో ఇలా చేయడంతో సామాన్యులకు విద్యను దూరం చేశారు. అలాగే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇదే తంతు కొనసాగింది. ఇలా వందలాది పాఠశాలలను మూసివేశారు. ఇదంతా కుట్రపూరితంగా జరిగిన కార్యక్రమంగా గుర్తించాలి. దీంతో ప్రైవేట్ విద్యా సంస్థలు తమ విస్తరణకు అవకాశంగా తీసుకున్నాయి. గ్రామాలకు బస్సులను నడుపుతూ, మండల కేంద్రాల్లో స్కూళ్లను పెడుతూ, వాటిని పెంచుకుంటూ వచ్చారు. దీంతో విధిలేక తల్లిదండ్రులు ఇంటిముందుకు వచ్చే బస్సులో తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపుతున్నారు. దీంతో వారిపై ఆర్థికభారం పడుతోంది. అనివార్యంగా ఇప్పుడు గ్రామాల్లో ప్రజలు తమ పిల్లను ప్రైవేట్ స్కూల్లకు బలిచేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం పెట్టాలన్న సంకల్పం మంచిదే అయినా గ్రామాలకు పాఠశాలలను దూరం చేయడం మాత్రం సరికాదు. ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయడం ద్వారా తమ పిల్లలు బడులకు దూరమవుతారంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్న తీరు ప్రభుత్వం వెంటనే గుర్తించి దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. సంస్కరణల పేరుతో పాఠశాలలను మూసివేస్తామంటే ఎలాగని గతంలోనే ఎపి హైకోర్టు నిలదీసింది. జాతీయ విద్యావిధానమంటూ విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా పాఠశాలల విలీనం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ఎలా చేపడతారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. విద్యాహక్కు చట్టం మేరకు విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని పాటిస్తున్నట్లు కనిపించడం లేదని కూడా హైకోర్టు అభిప్రాయ పడింది. ప్రాథమిక విద్య మాతృభాషలోనే ఉండాలని విద్యా హక్కు చట్టం చెబుతోంది. సర్కారు చర్యలు విద్యా వ్యవస్థను బలపరిచేలా ఉండాలే కానీ నిర్వీర్యం చేసేలా ఉండకూడదని పాలకులగుర్తించడం లేదు. నూతన విద్యా విధానం అమలు పేరుతో పాఠశాల విద్య దెబ్బతినకుండా, పిల్లలకు పాఠశాలలు దూరం కాకుండా చూసుకోవాలి. పాఠశాలల విలీనం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ద్వారా స్కూళ్ల సంఖ్యను తగ్గించే ప్రయత్నం చేయరాదు. స్కూళ్లను పెంచి, సౌకర్యాలు కల్పించి, టీచర్లను పెంచడం ద్వారా మరింత పటిష్టంగా ప్రభుత్వ విద్య అమలయ్యేలా చూడాలి. ప్రభుత్వ అనాలోచిత చర్య కారణంగా చిన్నారులు, బాలికలు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉంది. విద్యారంగం అన్నది ఏ రాష్ట్రానికైనా ప్రాధాన్యరంగం కావాలి. ఏకోపాధ్యా స్కూళ్లను మరింతగా మెరుగు పరచి ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలి. దీంతో నిరుద్యోగ సమస్యా తీరవచ్చు. ఆర్థికంగా భారమైనా విద్యాయరంగానికి కేటాయింపులు పెంచి అనుత్పాదక రంగాలకు, ఉచితపథకాలకు కోతలు పెట్టాలి. అప్పుడే విద్యారంగం పటిష్టం కావడంతో పాటు..అక్షరాస్యతా ఉద్యమం ముందు సాగగలదు.




# భారతీయ విద్యార్థి చిత్రహింసలపై విమర్శలు

## చట్టవిరుద్ధమైన వారికి యూఎస్‌లో ప్రవేశం లేదు

## చట్టబద్ధ ప్రయాణికులకు స్వాగతం ఉంటుందని వివరణ

**న్యూఢిల్లీ, జూన్ 10:** భారతీయ విద్యార్థి పట్ల అమెరికా అధికారులు ప్రవర్తించిన తీరు ప్రస్తుతం చర్చనీయాంశమవుతున్న వేళ అమెరికన్ ఎంబసీ దీనిపై వివరణ ఇచ్చుకుంది. న్యూయార్క్ ఎయిర్‌పోర్ట్‌లో విమానం దిగిన అతడ్ని సెక్యూరిటీ అధికారులు అడ్డుకున్నారు. తలను నేలకేసి నొక్కిపెట్టి హింసించారు. ఇదుకు సంబంధించిన వీడియో వైరల్ అయ్యింది. ఈ ఘటనను భారతీయులు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన నేపథ్యంలో భారత్‌లోని యూఎస్ రాయబార కార్యాలయం తాజాగా కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టబద్ధమైన ప్రయాణికులను అమెరికా స్వాగతిస్తూనే ఉంటుందని పేర్కొంది. అయితే, చట్టవిరుద్ధమైన వారికి తమ దేశంలోకి ప్రవేశించే హక్కు లేదని పేర్కొంది. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టింది. 'మా దేశంలోకి వచ్చే చట్టబద్ధమైన ప్రయాణికులను అమెరికా స్వాగతిస్తూనే ఉంటుంది. అయితే, చట్టవిరుద్ధమైన వారికి యూఎస్‌ను సందర్శించే హక్కు లేదు. అక్రమ ప్రవేశం, వీసాల దుర్వినియోగం, యూఎస్ చట్టాలను ఉల్లంఘించడాన్ని మేము సహించము. వారిని మా దేశంలోకి అనుమతించబోము' అని భారత్‌లోని యూఎస్ ఎంబసీ తన ట్వీట్‌లో పేర్కొంది. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది. కాగా, రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్.. అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఆ దేశంలో అక్రమంగా నివసిస్తున్న వారిని గుర్తించి స్వదేశాలకు పంపుతున్నారు. ఈ క్రమంలో భారత్‌కు చెందిన ఓ విద్యార్థి న్యూయార్క్ ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. నేలపై పడుకోబెట్టి, చేతులకు బేడీలు వేశారు. వీసా రద్ద యిందని, చట్ట వ్యతిరేకంగా అమెరికాలోకి ప్రవేశించావని చెప్తూ తిరిగి వెనక్కి పంపించారు. ఎయిర్‌పోర్ట్‌లో ఈ వీడియో తీసిన కునాల్ జైన్ అనే ప్రవాస భారతీయుడు సోషల్‌మీడియాలో పోస్ట్ చేశాడు. సదరు విద్యార్థి మాట తీరు చూస్తుంటే హర్యానాకు చెందిన వ్యక్తిగా అనిపించాడని పేర్కొన్నాడు. కలలను సాకారం చేసుకోవడానికి వచ్చానని, ఎవరికీ హాని తలపెట్టేందుకు రాలేదని.. విద్యార్థి బోరున విలపిస్తున్నా పట్టించుకోకుండా నేరస్థుడి పట్ల వ్యవహరించినట్టు ప్రవర్తించారని చెప్పాడు. ప్రత్యక్ష సాక్షిగా ఈ దారుణంపై స్పందించలేని, నిస్సహాయ స్థితిలో చూస్తూ ఉండిపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశాడు.





# రఘువంశీ హత్యకేసు సీన్ రీకన్‌స్ట్రక్షన్

## ఘటనా స్థలికి సోనమ్‌ను తీసుకెళ్లిన మేఘాలయ పోలీసులు

**షిల్లాంగ్, జూన్ 10:** మధ్యప్రదేశ్ వ్యక్తి రాజా రఘువంశీ హనిమూన్‌లో ఉండగా హత్యకు గురైన ఘటనలో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. షిల్లాంగ్‌లో హనీమూన్‌లో ఉండగా అతడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ హత్యకు కుట్ర పన్నిన మృతుడి భార్య సోనమ్‌ను షిల్లాంగ్ తరలించారు. సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసే క్రమంలో పోలీస్ బందోబస్తు మధ్య ఆమెను మేఘాల పోలీసులు తీసుకుని వెళ్లారు. ఆమె యూపీలో పోలీసులకు పట్టుబడింది. ఆమె ట్రాన్సిట్ రిమాండ్‌లో ఉంది. మరోవైపు, రఘువంశీని హత్య చేసిన సోనమ్ ప్రియుడు రాజ్ కుశ్వాహా, అతడి స్నేహితులను మేఘాలయ పోలీసులు విచారిస్తున్నారు. ఇక సోనమ్ తనకు ఎవరో మత్తుమందు ఇచ్చి యూపీకి తీసుకొచ్చారని విచారణలో తొలుత పేర్కొన్నట్టు- యూపీ అడిషనల్ జనరల్ అమితాబ్ యశ్ వెల్లడించారు. 'సోమవారం ఆమె ఘాజీపూర్‌లోని ధాబా వద్దకు చేరుకుంది. ఆ తరువాత తన కుటుంబానికి తాను ఎక్కడున్నదీ సమాచారం అందించింది. పోలీసులు తానున్న చోటకు వస్తారని తెలిసి ఇలా చేసింది. ఆమె కుటు-ంబసభ్యులు వెంటనే మధ్యప్రదేశ్ పోలీసులకు సమాచారం అందించారు. వారు యూపీలో స్థానిక పోలీసులను అలర్ట్ చేశారు. దీంతో, వారు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. తనకు ఎవరో డ్రగ్స్ ఇచ్చి అక్కడ వదిలిపెట్టారని ఆమె పేర్కొంది. ఆ తరువాత ఆమెను మెడికల్ చెకప్‌కు పంపించాము'సోనమ్‌కు పోలీసుల దర్యాప్తు తీరుతెన్నుల గురించి ఏమీ తెలియదు. బాధితురాలిగా నటించి తప్పించుకుందామని అనుకుంది. కానీ మేఘాలయ పోలీసుల అద్భుతంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఈ కేసును వారే హ్యాండిల్ చేస్తున్నారు' అని యశ్ అన్నారు. రాజా హత్యలో అతడి భార్య సోనమ్ ప్రధాన సూత్రధారి అని మేఘాలయ పోలీసులు బలంగా విశ్వసిస్తున్నారు. ప్లాన్ ఆమెదే అని అనుమానిస్తున్నారు. భర్తను హత్య చేయించేందుకు కాంట్రాక్ట్ కిల్లర్‌లను రంగంలోకి దిపిందని చెబుతున్నారు. రాజాను నిందితులు హత్య చేసి ఓ లోయలో పడేశారు. దాదాపు రెండు వారాల తరువాత అతడి మృతదేహం పోలీసులకు లభించింది. అక్కడికి సమీపంలోనే రక్తపు మరకలు ఉన్న కొడవలిని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘటన జరిగిన ప్రాంతానికి సమీపంలో ఇతర నిందితులతో కలిసి సోనమ్ ఉన్నట్టు సీసీటీ-వీల్లో కనిపించింది. మరోవైపు, రాజా హత్యకు కారణమైన వారిని మరణ శిక్ష విధించాలని మృతుడి కుటుంబం డిమాండ్ చేస్తోంది. నిందితులందరినీ మేఘాలయ పోలీసులు విచారిస్తున్నారు.

# పాక్ ఉగ్రవాద చర్యలను ఏ మాత్రం సహించం

## ఇలాగే కొనసాగితే పాక్‌లో చొచ్చుకు వెళ్లి దాడి చేస్తాం

## విదేశాంగ మంత్రి జై శంకర్ ఘాటు హెచ్చరికలు



**బ్రసెల్స్, జూన్ 10:** ఉగ్రదాడులతో రెచ్చగొడితే పాక్‌స్థాన్ లోపలకు చొచ్చుకెళ్లి మరీ భారత్ దాడులు చేస్తుందని విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ దాయాది దేశాన్ని మరోమారు హెచ్చరించారు. పహల్గాం వంటి పాశవిక ఉగ్రదాడులకు టెర్రరిస్టు సంస్థలు, వారి నేతలు పాల్పడితే దెబ్బకు దెబ్బ తీస్తామని స్పష్టం చేశారు. బహిరంగంగా పాక్ ఉగ్రవాదులకు శిక్షణను ఇస్తూ వారిని భారత్‌పైకి ఉసిగొల్పుతున్నారని, దీనిని ఇకముందు సహించేది లేదన్నారు. పహల్గాం ఉగ్రదాడికి జవాబుగా భారత్ ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన నెల రోజుల అనంతరం యూరప్‌లో జైశంకర్ పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా బెల్జియం, లక్సంబర్గ్‌లో భారత సంతతి ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఎంతో మంది అమాయకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులకు బహిరంగంగానే పాకిస్థాన్ శిక్షణ ఇస్తూ, వారిని ఇండియాపైకి ఉసిగొలుపుతోందని కేంద్రమంత్రి దుయ్యపట్టారు. ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. భారత్‌పై దాడులకు ఉగ్రవాదాన్ని ఒక సాధనంగా పాకిస్థాన్ మార్చుకుందని, ఇదే రెండు దేశాల మధ్య సమస్యలకు దారితీస్తోందని చెప్పారు. పాక్‌తో గత నెలలో యుద్ధం చెలరేగడానికి దారి తీసిన పరిస్థితులు ఇప్పటికీ అలాగే ఉన్నాయా? అనే ప్రశ్నకు జైశంకర్ బదులిచ్చారు. ఉగ్రవాదంతో ఉద్రిక్తతలు పెంచడానికే వాళ్లు కట్టుబడి ఉంటే ఆ పరిస్థితులు ఉన్నట్టేనని ఆయన సమాధానమిచ్చారు. యుద్ధం సందర్భంగా జరిగిన నష్టంపై కేంద్రమంత్రిని ప్రశ్నించగా.. సంబంధిత అధికారులు ఇందుకు సిద్ధంగా ఉన్నప్పుడు వెల్లడిస్తారని చెప్పారు. ఉగ్రవాదం అనేది ఏ రెండు దేశాలకో సంబంధించిన అంశంగా చూడరాదని, ప్రపంచ సమస్యగానే చూడాలని అన్నారు. ఈ సమావేశంలో బెల్జియం విదేశాంగ మంత్రి మాక్సిమ్ ప్రెవోట్ సైతం పాల్గొన్నారు.

# ఆషాఢ బోనాలకు ముందస్తు ఏర్పాట్లు



**హైదరాబాద్, జూన్ 10:** మరికొన్ని రోజుల్లో ఆషాడ మాసం రానుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలూ బోనాల జాతరను జరుపుకునేందుకు రెడీ అవుతున్నాయి. ఈ నెల 26వ తేదీ నుంచి ఆషాడ మాసం ప్రారంభం కానుంది. అయితే మొదటి రోజే గురువారం రావడంతో బోనాల సంబురాలు ప్రారంభం కానున్నాయి. తొలి బోనం గోల్కొండలోని అమ్మవారికి సమర్పించడంతో బోనాల సంబురాలు ప్రారంభం అవుతాయి. ఆషాఢ మాస బోనాల ఏర్పాట్ల గురించి ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. అధికారులకు సూచనలు ఇస్తోంది. జంట నగరాల్లోని మొత్తం 28 ఆలయాల్లో ఆషాఢ బోనాల జాతర ఘనంగా జరపాలని చెప్పారు. భక్తులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు రావొద్దని.. బోనాల పండగను జరపడం కోసం ఎక్కడ లోటు లేకుండా ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిందని.. ప్రభుత్వం నుంచి ఇప్పటికే రూ 20 కోట్ల మంజూరు చేశామని చెప్పారు.

# సజావుగా మొహర్రం ఊరేగింపు

## ఏర్పాట్లపై సమీక్షలో మంత్రి పొన్నం

**హైదరాబాద్, జూన్ 10:** జూలై మొదటి వారంలో జరగనున్న మొహర్రం ఉరేగింపు కార్యక్రమాలకు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తుందని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు . మొహర్రం ఏర్పాట్లపై మంగళవారం డా.బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీతో కలిసి వివిధ శాఖల అధికారులు, షియా మత పెద్దలతో మంత్రి పొన్నం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మొహర్రం కార్యక్రమాలు నిర్వహించే ఆశుర్ ఖానాల వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఆశుర్ ఖానాల పరిసర ప్రాంతాలలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజ్, రోడ్ల మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలని, అన్ని చోట్ల హైమాస్ట్ లైట్లను ఏర్పాట్లు చేయాలని మంత్రి సంబందిత అధికారులను ఆదేశించారు. అటవీ శాఖ అధికారులు మొహర్రం రోజు ఏనుగు ఊరేగింపు ఏర్పాట్లు చేయాలని అధికారులను సూచించారు. మొహర్రం ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రధాన ఊరేగింపు ప్రారంభం కానున్న బీబీకా-ఆలం పరిసరాల ప్రాంతంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఆశుర్ ఖానాలకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌళిక వసతులు కల్పించాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ సూచించారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, చార్మినార్, బహదూర్‌పురా, యాకత్ పురా, నాంపల్లి, కార్వాన్ ఎంఎల్ఎలు మీర్ జుల్ఫెకర్ అలీ, మహమ్మద్ ముబీన్, జాఫర్ హుస్సేన్, మాజిద్ హుస్సేన్, కౌసర్ మొహియుద్దీన్, ఎంఎల్‌సీలు మీర్జా రియాజ్ ఉల్ హసన్, అమీర్ అలీ ఖాన్, బల్మూరి వెంకట్, వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, మైనారిటీ- ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబైదుల్లా కొత్వాల్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్ ఎండి అశోక్ రెడ్డి, మైనారిటీ- సంక్షేమ శాఖ కార్యదర్శి, వక్ఫ్ బోర్డు సిఈఓ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని ప్రతిష్టాత్మక ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లోకి చేరాడు, ఇది అతని అద్భుతమైన క్రికెట్ కెరీర్‌లో మరో అద్భుతమైన అధ్యాయాన్ని సూచిస్తుంది. ఈ సంవత్సరం ఈ హోదా అందుకున్న ఏడుగురు క్రికెటర్లలో ఎంఎస్ ధోని కూడా ఉన్నారని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ సోమవారం ప్రకటించింది. వీరిలో మాథ్యూ హెడెన్ (ఆస్ట్రేలియా), హషీమ్ ఆమ్లా (దక్షిణాఫ్రికా) వంటి గొప్పవారు ఉన్నారు.

# ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్ జాబితాలో ధోనికి చోటు



ఈ గౌరవం అందుకున్న తర్వాత ఎంఎస్ ధోని మాట్లాడుతూ, "ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ తరాల క్రికెటర్ల సహకారాన్ని గుర్తించే ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో నా పేరు రావడం గౌరవంగా ఉంది. అలాంటి ఆల్ టైమ్ గ్రేట్స్‌తోపాటు నా పేరును చూడటం అద్భుతమైన అనుభూతి. " అని ధోని అన్నారు . ఒత్తిడిలో ధోని సహనం, సాటిలేని నైపుణ్యాలతోపాటు, చిన్న ఫార్మాట్లలో అతని మార్గదర్శక నైపుణ్యాలతో, ఎంఎస్ ధోని ఆటలో గొప్ప ఫినిషర్లు, నాయకులు, వికెట్ కీపర్లలో ఒకరిగా పేరు పొందారని చెప్పుకొచ్చింది. అటువంటి పరిస్థితిలో, ఐసీసీ క్రికెట్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చేర్చడం ద్వారా అతన్ని గౌరవించింది. "భారతదేశం తరపున ధోని 17,266 అంతర్జాతీయ పరుగులు, 829 వికెట్లు(వికెట్ల వెనకాల), వివిధ ఫార్మాట్లలో 538 మ్యాచ్‌ల గణాంకాలు అతని ప్రతిభను మాత్రమే కాకుండా అసాధారణమైన స్థిరత్వం, ఫిట్‌నెస్‌ను ప్రతిబింబిస్తాయి" అని ఐసిసి ఒక ప్రకటనలో తెలిపింది. భారత క్రికెట్ సంధి దశలో ఉన్నప్పుడు అద్భుతమైన కెప్టెన్‌గా రాణించడాని ఐసీసీ కొనియాడింది. ముఖ్యంగా 2004లో అరంగేట్రం చేసిన ధోనీ.. తన రాకను ప్రపంచానికి చాటాడు. ఆ తర్వాత 2007 వన్డే ప్రపంచకప్ లీగ్ దశలో భారత్ ఇంటిముఖం పట్టడంతో తీవ్రమైన నిరాశ స్థితిలో ఉన్నప్పుడు ధోనీ టీ20 జట్టు పగ్గాలు చేపట్టాడు. తొలిసారిగా నిర్వహించిన ఆ టోర్నీలో అద్భుత ప్రదర్శనతో టైటిల్ ను భారత్ నెగ్గింది. ఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ పై ఉత్కంఠభరిత విజయం సాధించింది. దీంతో కెప్టెన్ గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. ఆ తర్వాత టీమిండియా మరిన్ని శిఖరాలు అధిరోహించడంలో కీలక పాత్ర పోషించాడు. 1983లో వన్డే ప్రపంచకప్ గెలిచాక, మళ్లీ 28 ఏళ్ల తర్వాత టీమిండియా ఆ ట్రోఫీని ధోనీ సారథ్యంలోనే గెలుచుకుంది. ఆ తర్వాత రెండేళ్లకు 2013 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ధోనీ సారథ్యంలో ఎంతోమంది మెరికల్లాంటి క్రికెటర్లు వెలుగులోకి వచ్చారు. రోహిత్ శర్మ, ఆర్పీ సింగ్, రాబిన్ ఉతప్ప, దినేశ్ కార్తీక్ లాంటి వాళ్లు సత్తా చాటారు. ఇక 2019లో అంతర్జాతీయ కెరీర్ కు వీడ్కోలు ప్రకటించాక, ప్రస్తుతం ఐపీఎల్ మాత్రమే ఆడుతున్నాడు. ఇక తనకు హాల్ ఆఫ్ ఫేమ్ గౌరవం దక్కడంపై ధోనీ ఆనందం వ్యక్తం చేశాడు. తరతరాలుగా మేటి ఆటగాళ్లను ఈ జాబితాలో చోటు దక్కించుకుంటున్నారని, తన పేరు కూడా ఈ లిస్టులో ఉండటం ఆనందంగా ఉందని పేర్కొన్నాడు.



# అశ్విన్‌కు భారీ ఫైన్

చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌కు షాక్ తగిలింది. అంపైర్‌పై కోపం ప్రదర్శించినందుకు అతడికి మ్యాచ్ రిఫరీ భారీ జరిమానా విధించారు. ఏంటీ ఐపీఎల్ టోర్నీ ముగిసింది కదా, మరి ఫైన్ ఎలా పడింది అనుకుంటున్నారా మరి ఇది ఏ మ్యాచ్‌లో జరిగిందంటే అశ్విన్ ప్రస్తుతం 2025 తమిళనాడు ప్రీమియర్ లీగ్ టోర్నీలో ఆఢుతున్నాడు. ఇందులో అశ్విన్ దుండిగల్ డ్రాగన్స్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. టోర్నీలో భాగంగా సోమవారం దుండిగల్ డ్రాగన్స్ - ఐడ్రీమ్ తిరుప్పూర్ తమిజాన్స్ మధ్య మ్యాచ్ జరిగింది. మ్యాచ్‌లో సాయి కిషోర్ బంతిని స్వీప్ ఆడబోయిన అశ్విన్‌ను అంపైర్ ఎల్‌బీడబ్ల్యూగా ఔటిచ్చాడు. 5వ ఓవర్లో ఐదో బంతిని అశ్విన్ ప్యాడల్ స్వీప్ ఆడగా, బాల్ ప్యాడ్లను తాకింది. అశ్విన్ సింగిల్ కోసం పరుగెత్తగా, బౌలర్ అప్పీల్ చేశాడు. ఫీల్డ్ అంపైర్ కృతిక వెంటనే ఔటిచ్చింది. లెగ్ స్టంప్ ఆవల బంతి పిచ్ అయినట్లు రిప్లేలో స్పష్టంగా కనిపించింది. అయితే అశ్విన్, శివమ్ సింగ్ తొలి ఓవర్లోనే రెండు రివ్యూలు వాడేయడంతో, సమీక్ష తీసుకోడానికి ఛాన్స్ లేకుండా పోయింది. దీంతో తనను ఔటివ్వడంతో అశ్విన్‌కు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. అంపైర్ వద్ద వాదించినా ఫలితం లేకపోయింది. మైదానాన్ని వీడుతూ సహనం కోల్పోయిన అశ్విన్, బ్యాట్?ను బలంగా తన ప్యాడ్లపై కొట్టుకున్నాడు. బౌండరీ లైన్ దగ్గరికి రాగానే గ్యాలరీలోకి గ్లోవ్‌ను విసిరికొట్టాడు. అశ్విన్ దురుసు ప్రవర్తనపై టీఎన్‌పీఎల్ తాజాగా చర్యలు తీసుకుంది. మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధించింది. ఇందులో 10 శాతం అంపైర్?పై ఆగ్రహం వ్యక్తం చేసినందుకు, 20 శాతం పరికరాలు ధ్వంసం చేసినందుకు ఫైన్ పడింది.

# అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన నికోలస్ పూరన్



వెస్టిండీస్ విధ్వంసకర బ్యాటర్ నికోలస్ పూరన్ అంతర్జాతీయ క్రికెట్?కు వీడ్కోలు పలికాడు. కేవలం 29 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి అందరినీ షాక్?కు గురిచేశాడు. ఇది ఎంతో కఠినమైన నిర్ణయమని తన ఇన్‌స్టా ఖాతాలో పేర్కొన్నాడు. తనపై ఎంతో ప్రేమను చూపించిన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపాడు. విండీస్? టీమ్?లో నికోలస్ పూరన్?ను ముద్దుగా నిక్కీ పీ అని పిలుస్తుంటారు. విండీస్ తరఫున నికోలస్ పూరన్? 61- వన్డేలు, 106- టీ20లు ఆడాడు. అంతేకాదు టీ20లో విండీస్? జట్టుకు కెప్టెన్?గానూ వ్యవహరించాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో లఖ్‌నవూ తరఫున ఆడి భారీ ఇన్నింగ్స్‌లతో క్రికెట్ అభిమానులను ఆకట్టుకున్నాడు. మొత్తంగా చూసుకుంటే, నికోలస్ పూరన్ వన్డేల్లో 1,983 పరుగులు, టీ20ల్లో 2,275 పరుగులు చేశాడు. క్రికెట్ వెస్టిండీస్? నికోలస్ పూరన్?ను 'గేమ్-ఛేంజర్?' అని ప్రశంసించింది. క్రికెట్?కు, వెస్టిండీస్? జట్టుకు కోసం చేసిన అత్యుత్తమ కృషికి కృతజ్ఞతలు తెలిపింది. 'డియర్ ఫ్యాన్స్.. చాలా ఆలోచనలు, పరిశీలనల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నాను. ఈ ఆట నాకెంతో ఇచ్చింది. ఇంకా ఇస్తూనే ఉంటుంది. ఈ ప్రయాణంలో ఎంతో ఆనందం, ఎన్నో మరుపురాని జ్ఞాపకాలు ఉన్నాయి. వెస్టిండీస్‌కు ప్రాతినిథ్యం వహించడాన్ని గర్వంగా భావిస్తున్నా. మెరూన్ జెర్సీని ధరించడం, మైదానంలో నిలబడి జాతీయ గీతం ఆలపించడం.. జట్టు కోసం సాయశక్తులా కృషి చేయడం.. ఇవన్ని నాకు ఎంత ముఖ్యమో మాటల్లో చెప్పలేను. వెస్టిండీస్ జట్టుకు సారథ్యం వహించడం ఎప్పటికీ మరిచిపోలేను. అత్యంత అరుదైన గౌరవంగా భావిస్తాను. నాపై ప్రేమను చూపించిన అభిమానులకు కృతజ్ఞతలు. కష్ట సమయాల్లో అండగా నిలిచారు. నా సక్సెస్‌ను సెలబ్రేట్ చేసుకున్నారు. నా కుటుంబం, స్నేహితులు, నా సతీమణితో పాటు నా ఈ ప్రయాణంలో నాతో నడిచిన మీకు ధన్యవాదాలు. మీ మద్దతు, నమ్మకం నన్ను నిలబెట్టాయి. నా కెరీర్‌లో అంతర్జాతీయ అధ్యాయం ముగిసినప్పటికీ.. వెస్టిండీస్ క్రికెట్‌పై నాకున్న ప్రేమ ఎప్పటికీ చెక్కు చెదరదు. వెస్టిండీస్ జట్టు మరింత బలంగా మారడంతో పాటు అద్భుతమై విజయాలు అందుకోవాలని కోరుకుంటా.'అని నికోలస్ పూరన్ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. నికోలస్ పూరన్ ఫ్రాంచైజీ క్రికెట్‌లో మాత్రమే ఆడనున్నాడు. 2016లో పాకిస్థాన్‌తో దుబాయ్ వేదికగా జరిగిన టీ20 మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన నికోలస్ పూరన్ 106 మ్యాచ్‌లు ఆడి 2275 పరుగులు చేశాడు. ఇందులో 13 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 2019లో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌తో అంతర్జాతీయ వన్డేల్లోకి అడుగుపెట్టిన నికోలస్ పూరన్.. 61 మ్యాచ్‌ల్లో 1983 పరుగులు చేశాడు. ఇందులో మూడు సెంచరీలతో పాటు 11 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. టెస్ట్ క్రికెట్ ఆడకుండానే నికోలస్ పూరన్ 9 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్ ముగిసింది. 2019 వన్డే ప్రపంచ కప్‌లో నికోలస్ పూరన్ అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. 9 మ్యాచ్‌ల్లో 367 పరుగులు చేసి విండీస్ తరపున టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ టోర్నీలో శ్రీలంకపై తొలి సెంచరీ సాధించిన పూరన్.. నెదర్లాండ్స్, నేపాల్‌పై మరో రెండు శతకాలు నమోదు చేశాడు. ఈ టోర్నీలో పూరన్ కనబర్చిన అత్యుత్తమ ప్రదర్శనకు ఐసీసీ రైజింగ్ స్టార్ అని పేర్కొంటూ అభినందించింది. టీ20ల్లో వెస్టిండీస్ తరపున అత్యధిక పరుగులు (2275) సాధించిన ఆటగాడి పూరన్ నిలిచాడు. ఈ క్రమంలో అతను క్రిస్ గేల్ రికార్డును అధిగమించాడు. భారీ సిక్సులు బాదడం.. తన విధ్వంసకర బ్యాటింగ్‌తో క్షణాల్లో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేయడం పూరన్ నైజం. 2024 టీ20 ప్రపంచ కప్ 2024లో పూరన్ 113 మీటర్ల భారీ సిక్సర్ కొట్టాడు. నిక్కీపీ అని ముద్దుగా పిలుచుకునే పూరన్.. టీ20ల్లో వెస్టిండీస్‌కు సారథ్యం కూడా వహించాడు. జట్టులో కీలక ఆటగాడిగా మారాడు. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ జరగనుండగా.. పూరన్ రిటైర్మెంట్ ప్రకటించడం అభిమానులను షాక్‌కు గురి చేసింది.

# ఆర్సీబీకి కర్ణాటక హైకోర్టులో దక్కని ఊరట

బెంగళూరు చిన్నస్వామి తొక్కిసలాట కేసులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు  కి కర్ణాటక హైకోర్టులో ఊరట దక్కలేదు. ఈ కేసులో అరెస్ట్ అయిన ఆర్సీబీ మేనేజర్‌కు బెయిల్ ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. హైకోర్టు తన తీర్పును బుధవారం (జూన్ 11వ తేదీకి) రిజర్వ్ చేసింది. చిన్నస్వామి తొక్కిసలాట ఘటనపై తదుపరి విచారణ జూన్ 12న జరగనుంది. కర్ణాటక హైకోర్టు మంగళవారం నాడు (జూన్ 10న)  మార్కెటింగ్ అండ్ రెవెన్యూ హెడ్ నిఖిల్ సోస్లేకు మధ్యంతర బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. జూన్ 11 వరకు రిజర్వ్ చేయాలని కోర్టు సూచించింది. జూన్ 6న పోలీసులు సోస్లేను అరెస్టు చేశారని తెలిసిందేఆర్సీబీ మార్కెటింగ్ అండ్ రెవెన్యూ హెడ్ నిఖిల్ సోస్లే తనను అరెస్ట్ చేయడంపై హైకోర్టును ఆశ్రయించారు. కానీ ఆర్సీబీ మేనేజర్ సోస్టేకు కోర్టులో ఊరట దక్కలేదు. ఇప్పుడు ఈ కేసులో తదుపరి విచారణ జూన్ 12న జరగనుంది. సోస్లే తన అరెస్టు చట్టవిరుద్ధమని మధ్యంతర బెయిల్ పిటిషన్‌లో పేర్కొన్నారు. రాజకీయ ఆదేశాల ద్వారా పోలీసులు ప్రభావితమై అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం కర్ణాటక హైకోర్టు సోస్లేకు బెయిల్ నిరాకరించింది. %=జదీ% ఐపీఎల్ 2025 టైటిల్‌ను గెలిచింది. ఐపీఎల్ చరిత్రలో అది వారికి తొలి ఐపీఎల్ ట్రోఫీ. మరుసటి రోజు (జూన్ 4న) విన్నింగ్ సెలబ్రేషన్ చేయాలని ఆర్సీబీ నిర్ణయం తీసుకుంది.  దాంతో ట్రోఫీని చూడటానికి, ఆర్సీబీ జట్టు విక్టరీ వేడుకలో భాగం కావాలనుకున్నారు. చిన్నస్వామి స్టేడియం వద్దకు ఫ్యాన్స్ పెద్ద ఎత్తున రావడంతో పోలీసులు వారిని అదుపు చేయడానికి లాఠీఛార్జ్ చేశారు. ఈ క్రమంలో స్టేడియం వ్ద తొక్కిసలాట జరగడంతో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలలో భాగంగా పలువురు పోలీసు అధికారులను సస్పెండ్ చేసింది. తొక్కిసలాటలో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలు ఇస్తామని కర్ణాటక ప్రభుత్వం ప్రకటించింది. అయితే నష్టపరిహారం పెంచారు. రాష్ట్ర ప్రభుత్వం మరణించిన వారికి రూ.25 లక్షలు నష్టపరిహారంగా అందజేస్తుంది. ఫ్రాంచైజీ RCB కూడా మరణించిన వారికి రూ.10 లక్షలు ఇవ్వాలని ప్రకటించింది.





# నా జిడ్డు బ్యాటింగ్ వల్లే పంజాబ్‌కు ఓటమి

## యువ బ్యాటర్ నెహాల్ వధేరా

ఐపీఎల్ 2025 ఫైనల్లో పంజాబ్ కింగ్స్ ఓటమికి తన బ్యాటింగ్ వైఫల్యమే ప్రధాన కారణమని యువ బ్యాటర్ నెహాల్ వధేరా అన్నాడు. తాను ఇంకాస్త మెరుగ్గా ఆడి ఉంటే పంజాబ్ విజయం సాధించేదని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో అసాధారణ ప్రదర్శన కనబర్చిన పంజాబ్ కింగ్స్.. 11 ఏళ్ల తర్వాత ఫైనల్ చేరింది. కానీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)తో అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఫైనల్లో 6 పరుగుల తేడాతో ఓటమిపాలై తృటిలో టైటిల్ చేజార్చుకుంది. 191 పరుగుల లక్ష్యచేధనలో 18 బంతులాడిన నెహాల్ వధేరా 15 పరుగులు మాత్రమే చేసి వెనుదిరిగాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(1) కూడా తీవ్రంగా నిరాశపర్చాడు. దాంతో శశాంక్ సింగ్(30 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్స్‌లతో 61) ఒంటరి పోరాటం చేసినా ఫలితం దక్కలేదు. తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫైనల్ మ్యాచ్‌పై స్పందించిన నెహాల్ వధేరా.. తమ ఓటమికి పిచ్ కండిషన్స్‌ను సాకుగా చూపించలేనని స్పష్టం చేశాడు. తాను వేగంగా ఆడి ఉంటే ఫలితం మరోలా ఉండేదన్నాడు. 'ఫైనల్లో పంజాబ్ కింగ్స్ ఓటమికి పూర్తి బాధ్యత నాదే. ఆ సమయంలో నేను ఇంకాస్త మెరుగ్గా బ్యాటింగ్ చేసుంటే ఖచ్చితంగా విజయం సాధించేవాళ్లం. పిచ్‌ను నేను నిందించను. ఎందుకంటే ఇదే వికెట్‌పై ఆర్సీబీ 190 పరుగులు చేసింది. నేను ఆటను ఆఖరి వరకు తీసుకెళ్తాం అనుకున్నాను. చివరి వరకు క్రీజులో ఉండి విజయలాంఛనాన్ని పూర్తి చేయాలని భావించాను. కానీ అలా చేయలేకపోయాను. నేను ఇప్పటి వరకు ఆడిన టోర్నీల్లో వేగంగా ఆడిన ప్రతీసారి ఆశించిన ఫలితం దక్కింది. కానీ ఫైనల్ మ్యాచ్‌లో మాత్రం ప్రతికూల ఫలితం ఎదురైంది. కొన్ని రోజులు మన ఆటకు అనుకూలించవు. ఆ రోజు కూడా నాకు కలిసి రాలేదు. ఇందుకు నాకు ఎలాంటి పశ్చాతాపం లేదు. వికెట్లు పడుతున్నా.. ఆటను చివరి వరకు తీసుకెళ్లే ప్రయత్నం చేశాను. కానీ నేను ఇంకొంచెం వేగంగా ఆడాల్సింది. ఈ ఓటమి ద్వారా నేను నేర్చుకున్న విషయం ఇదే. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితుల్లో వేగంగా ఆడే ప్రయత్నం చేస్తాను. రెండో మ్యాచ్‌లోనే నాకు ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడే అవకాశం దక్కుతుందని అస్సలు ఊహించలేదు. అదృష్టవశాత్తూ.. ఆ మ్యాచ్‌లో మేం ముందుగా బౌలింగ్ చేశాం. ఛేజింగ్ సమయంలో రింకీ పాంటింగ్ వచ్చిన ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగాల్సి ఉంటుందని చెప్పాడు. నేను గత ఇంటర్వ్యూలో చెప్పినట్లుగా నా దగ్గర ఒక్క క్రికెట్ కిట్ మాత్రమే ఉండేది. ఐపీఎల్‌కు కూడా ఒక్క కిట్‌తోనే వచ్చాను. సాధారణంగా ఆటగాళ్లు ఎక్స్‌ట్రా కిట్‌తో వస్తారు. నేను మాత్రం ఒక్క కిట్‌తోనే ఆడాలనుకున్నాను. ఆ మ్యాచ్‌లో నాపై ఎలాంటి ఒత్తిడి లేదు. నేను నేరుగా రికీ పాంటింగ్ వద్దకు వెళ్లాను. మ్యాచ్‌ను ముగించాలని రికీ పాంటింగ్ చెప్పారు. నేను ముగిస్తానన్నాను. సహజంగా ఆడుతూ లూజ్ బాల్స్‌ను బౌండరీకి తరలించాను.'అని నెహాల్ వధేరా చెప్పుకొచ్చాడు.

# విజయ్ దేవరకొండ కింగ్‌డమ్‌కు విఎఫ్ఎక్స్ ఎఫెక్ట్

## జూలైకి వాయిదా పడడం ఖాయమంటూ వార్తలు



ఇవాళ భారీ తెలుగు సినిమాలన్నీ విఎఫ్ఎక్స్ మీదనే ఎక్కువగా ఆధారపడి వుంటుతున్నాయి. ఆ వర్క్ కాస్తంత ఆలస్యమైనా... పోస్ట్ ప్రొడక్షన్ లో ఊహకందని జాప్యం ఏర్పడుతోంది. దాంతో సినిమాలను ముందు ప్రకటించిన తేదీకి విడుదల చేయలేని నిస్సహాయ స్థితిలోకి నిర్మాతలు జారిపోతున్నారు. పవన్ కళ్యాణ్ సినిమా కూడా ఈ కారణంగానే వాయిదా పడింది. తాజాగా విజయ్ దేవరకొండ కింగ్ డమ్ మూవీ మళ్లీ వాయిదా పడేలా ఉంది. ఇప్పటికే మే 30న రిలీజ్ చేస్తామని గతంలోనే ప్రకటించినా.. చివరకు జులై 4కు వాయిదా వేశారు. ఇప్పుడు మళ్లీ వాయిదా వేస్తారని తెలుస్తోంది. కింగ్ డమ్ కంటే ముందే నితిన్ నటించిన తమ్ముడు మూవీ జులై 4న రిలీజ్ డేట్ ప్రకటించింది. తమ్ముడు మూవీ ఉన్నా సరే రిలీజ్ కు ముందు డేర్ చేసింది. కానీ ఇప్పుడు వెనకడుగు వేస్తున్నట్టు తెలుస్తోంది. పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు జూన్ 12 నుంచి తప్పుకుంది. చూస్తుంటే వీరమల్లు జులై మొదటి వారంలోనే రిలీజ్ కు రెడీ అవుతున్నట్టు సమాచారం. వీరమల్లు జులై మొదటి వారంలోనే వస్తే తమ కింగ్ డమ్ మూవీని వాయిదా వేసుకుంటామని ఇప్పటికే నాగవంశీ క్లారిటీ ఇచ్చాడు. నిన్న అమేజాన్ తో ముంబైలో వీరమల్లు టీమ్ చర్చలు జరిపింది. ఆల్రెడీ అమేజాన్ వాళ్లు అడ్వాన్స్ ఇవ్వడంతో.. ఇప్పుడు త్వరగా రిలీజ్ చేయాలని ఒత్తిడి పెడుతున్నారంట. వీటన్నింటి నేపథ్యంలో వీరమల్లు జులైకే షిఫ్ట్ అయినట్టు– తెలుస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో ప్రకటన కూడా రాబోతోంది. ఎటు చూసుకున్నా కింగ్ డమ్ వాయిదా తప్పేలా లేదు. ఎందుకంటే పోటీ– నడుమ కింగ్ డమ్ ను రిలీజ్ చేయడానికి మేకర్స్ రెడీగా లేరు. సోలోగా వచ్చి ఎక్కువ వసూళ్లు రాబట్టాలని చూస్తున్నారంట. అందుకే మరోసారి వాయిదా వేసినా ఆశ్చర్యపోనవసరం లేదు. జులై 25కు వాయిదా వేసే అవకాశం ఉంది.

# చిన్నారుల సమక్షంలో పుట్టిన రోజు వేడుకలు

## బసవతారకం ఆస్పత్రిలో కేక్ కట్ చేసిన బాలకృష్ణ



ప్రముఖ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రిలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఆసుపత్రి సిబ్బంది, చిన్నారుల సమక్షంలో బాలకృష్ణ కేక్ కట్ చేశారు. చిన్నారులకు ఈ సందర్భంగా ఆయన బహుమతులను అందజేశారు. ఎన్టీఆర్ దంపతుల విగ్రహానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయసు కేవలం ఒక నంబర్ మాత్రమేన్నారు. బాలకృష్ణ అంటే ఏంటో ఇక నుంచి చూపిస్తానని అన్నారు. నా దృష్టిలో నంబర్ పెద్ద విషయం కాదు. నా వయసు అందరికీ తెలిసిందే. తల్లిదండ్రుల దీవెనలతో 64 ఏళ్లు పూర్తి చేసుకున్నా. మా నాన్న కోరిక మేరకు ఒకసారి మెడిసిన్ ఎంట్రెన్స్ రాశాను. మెడిసిన్ చదవలేదు కానీ.. సినిమాల్లో డాక్టర్ పాత్రలు చేశాను. 15 ఏళ్ల క్రితం బసవతారకం ఆసుపత్రికి ఛైర్మన్ అయ్యాను. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వైద్యం అందించేలా కృషి చేస్తున్నాం. బాలకృష్ణ అంటే ఏంటో ఇక నుంచి చూపిస్తాను. నాకు చాలా పొగరని అందరూ అనుకుంటారు.. అవును నన్ను చూసుకొనే నాకు పొగరు. బిరుదులకు నేను అలంకారమేమో గానీ.. బిరుదులు నాకు అలంకారం కాదు. బిరుదులు వస్తుంటాయి.. కానీ మన పని మనం చేసుకుంటూ పోవాలని బాలకృష్ణ అన్నారు. ఇకపోతే బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా సినీ, రాజకీయ ప్రముఖులు విషెస్ తెలిపారు. అభిమానుల కోసం పుట్టినరోజు కానుకగా ఆయన నటిస్తోన్న 'అఖండ 2' నుంచి పవర్‌ఫుల్ టీజర్‌ను చిత్రబృందం పంచుకుంది. ప్రస్తుతం అది భారీ వ్యూస్‌తో సోషల్ మీడియాలో –ట్రెండింగ్‌లో ఉంది. సెప్టెంబర్ 25న ఈ సినిమా విడుదల కానుంది.



# మాల్దీవుల బ్రాండ్ అంబాసిడర్‌గా కత్రినా

పర్యాటకులకి మాల్దీవ్స్ ఎంతటి ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఇస్తుందనేది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నీలి రంగు సముద్రం చూస్తుంటేనే మనసు పులకరించిపోతుంది. అయితే మాల్దీవ్స్ జీవితంలో ఒక్కసారైన చూడాలని చాలా మందికి కల ఉంటుంది. ఇప్పుడు మాల్దీవులకి గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా కత్రినా కైఫ్ ఎంపికయింది. మాల్దీవులను ప్రముఖ పర్యాటక గమ్యంగా పరిచయం చేయడంలో భాగంగా కత్రినాని అంబాసిడర్‌గా ఎంపిక చేసినట్టు మాల్దీవుల టూరిజం ప్రమోషన్ సంస్థ అయిన మాల్దీవ్స్ మార్కెటింగ్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ కార్పొరేషన్ తాజాగా ప్రకటించింది. కత్రినా కైఫ్ రాయబారిగా ఎంపిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ.. మాల్దీవులు అనేవి సహజసిద్ధమైన అందం, ఎంతో ప్రశాంతంగా ఉండే ప్రదేశం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటకులని పెంచేందుకు, వారికి అత్యుత్తమ అనుభవాలను అందించేందుకు నా వంతు కృషి చేస్తానని కత్రినా స్పష్టం చేశారు. మరోవైపు, మాల్దీవ్స్ రాజకీయంగా కూడా భారత్ సంబంధాలు మెరుగుపరచుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు- తెలుస్తుంది. మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముఇజ్జు ఇచ్చిన ఆహ్వానానికి సానుకూలంగా స్పందించిన , భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జూలై నెలలో మాల్దీవులకు వెళ్లే అవకాశముందంటూ నెట్టింట ప్రచారం జరుగుతుంది. ఇదే నిజమైతే ముఇజ్జు అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని మోదీ మొదటి పర్యటన అవుతుంది. కత్రినా -కైఫ్ గ్లోబల్ అంబాసడర్‌గా, మరోవైపు ప్రధాని మోదీ పర్యటన ..ఈ రెండు సంఘటనలూ మాల్దీవులను ఒక ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా బలోపేతం చేయడం ఖాయం అని నెటిజన్స్ అంటున్నారు.




# మెహ్రీన్ ఎలా అయ్యిందో చూడండి

నాని హీరోగా నటించిన కృష్ణ గాడి వీర ప్రేమ గాధ సినిమాతో హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ మెహ్రీన్. ఈ అమ్మడు మొదటి సినిమాలో అందంతో ఆకట్టుకోవడంతో పాటు జూనియర్ మిల్కీ బ్యూటీ అనే ట్యాగ్‌ను సొంతం చేసుకుంది. మిల్కీ బ్యూటీ తమన్నా రేంజ్‌లో ఈ అమ్మడికి టాలీవుడ్‌లో ఫ్యూచర్ ఉంటుందని అంతా భావించారు. కానీ అనూహ్యంగా ఆమెకు లక్ కలిసి రాలేదు. హీరోయిన్‌గా చేసిన సినిమాల్లో కొన్ని సూపర్ హిట్ అయ్యాయి. అయినా కూడా యంగ్ స్టార్ హీరోలకు జోడీగా ఈ అమ్మడికి నటించే అవకాశం దక్కలేదు. ఆ మధ్య వరుస సినిమాలు చేసిన మెహ్రీన్ ఈ మధ్య సినిమాలే చేయడం లేదు. చివరగా మెహ్రీన్ తెలుగులో 'ఎఫ్ 3' సినిమాలో కనిపించింది. ఎఫ్ 2 లో ఈమె చేసిన హనీ పాత్రకు మంచి స్పందన దక్కింది. అందుకే ఎఫ్ 3 లోనూ అదే పాత్రలో మెహ్రీన్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి నటింపజేశాడు. ఎఫ్ 3 సినిమా ఆశించిన స్థాయిలో విజయాన్ని సొంతం చేసుకోలేదు. దానికి తోడు మెహ్రీన్ పాత్ర మరీ నాసిరకంగా ఉంది అంటూ విమర్శలు వచ్చాయి. అందుకే మెహ్రీన్ హీరోయిన్‌గా తెలుగులో ఆఫర్లు దక్కించుకోవడంలో విఫలం అవుతోంది. ప్రస్తుతం ఒక కన్నడ మూవీ తప్ప మరే సినిమాలను ఈ అమ్మడు చేయడం లేదు. త్వరలో తెలుగులో ఈమె సినిమాలు చేయాలని అభిమానులు బలంగా కోరుకుంటున్నారు. సినిమాలతో పెద్దగా సందడి చేయకున్నా హీరోయిన్‌గా ఆఫర్లు రాకున్నా కూడా సోషల్ మీడియాలో ఈమె అందాల ఆరబోత ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఈమె షేర్ చేసే అందాల స్కిన్ షో ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉన్నాయి. మెహ్రీన్ హీరోయిన్‌గా వచ్చిన పాపులారిటీ కంటే ఆమె అందంగా కనిపిస్తూ షేర్ చేసిన ఫోటోల వల్ల వచ్చిన పాపులారిటీ ఎక్కువ అనే అభిప్రాయం సైతం కొందరు వ్యక్తం చేస్తూ ఉంటారు. ఆకట్టుకునే మెహ్రీన్ ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుందని మరో సారి నిరూపితం అయింది. అందంగా కనిపించడం మాత్రమే కాకుండా ఫోటోలకు అద్భుతమైన ఫోజ్‌లు ఇవ్వడం అనేది మెహ్రీన్‌కి మాత్రమే సాధ్యం అంటూ ఉంటారు.

# నా పెళ్లి అయింది.. శ్రేయస్ పిల్లలకు తల్లిని నేనే!

టీం ఇండియా ఆటగాడు శ్రేయస్ అయ్యర్‌కి ఉన్న ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. టీం ఇండియా జట్టులో ప్రతి ఒక్కరికీ కోట్లాది మంది ఫ్యాన్స్ ఉంటారు. అలాంటిది స్టార్ ప్లేయర్ కావడంతో శ్రేయస్ అయ్యర్‌కి ఫాలోయింగ్ మరింత ఎక్కువ ఉంటుంది అనడంలో సందేహం లేదు. కోట్లాది మంది అభిమానించే శ్రేయస్ అయ్యర్ పై ఒక టీవీ స్టార్ చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. చాలా మంది షాక్ అయ్యే విధంగా కూడా ఉన్నాయి. బిగ్‌బాస్ 18 ద్వారా పాపులారిటీని సొంతం చేసుకున్న ఈ దుబాయ్ ముద్దుగుమ్మకు శ్రేయస్ అయ్యర్ అంటే అభిమానం కంటే ఎక్కువ. అందుకే అతడిని పెళ్లి చేసుకున్నాను అని ప్రకటించింది. దుబాయ్‌లో నివాసం ఉండే నటి ఎడిన్ రోజ్ మాట్లాడుతూ... శ్రేయస్ అయ్యర్‌తో నాకు పెళ్లి అయింది. నా మనసులో ఇప్పటికే నేను అతడికి భార్యగా ఉన్నాను. అతడి పిల్లలకు తల్లిని కూడా అనుకుంటున్నాను. అతడు నా జీవితంలో ఒక భాగంగా ఉన్నాడు. అతడితో జీవితం పంచుకుంటున్నట్లుగానే నేను నా జీవితాన్ని సాగిస్తున్నాను అంటూ షాకింగ్ వ్యాఖ్యలు చేసింది. అతడికి ఉన్న ఫాలోయింగ్ కారణంగా ఎడిన్ రోజ్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుందని, కేవలం పబ్లిసిటీ కోసమే ఆమె ఇలా మాట్లాడుతుందని చాలా మంది అనుకున్నారు. కానీ ఆమె మాటల్లో నిజాయితీ కనిపిస్తుందని, ఆమె చేస్తున్న వ్యాఖ్యల్లో ప్రేమ కనిపిస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. శ్రేయస్ అయ్యర్ ను వివాహం చేసుకున్నట్లుగా భావిస్తున్నట్లు ఎడిన్ రోజ్ విషయం గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆమె తన అభిమానంను చాటుకునే విధానం ఇది కాదు అంటూ కొందరు అంటూ ఉంటే, కొందరు మాత్రం ఆమె ఇలా చేయడం ద్వారా శ్రేయస్ అయ్యర్‌ను వివాహం చేసుకోవచ్చు అని భావిస్తూ ఉంటుంది అంటున్నారు. మొత్తంగా శ్రేయస్ అయ్యర్ దృష్టిని ఆకర్షించడం కోసం ఈమె చేస్తున్న ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావు. ఆమె అభిమానంలో, ప్రేమలో నిజాయితీ ఉంటే కచ్చితంగా శ్రేయస్ ఆమెను కలుస్తాడు అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. శ్రేయస్ ప్రస్తుతం మంచి ఫామ్‌తో క్రికెట్‌లో కొనసాగుతున్నాడు.

బిగ్ బాస్ షో ద్వారా ఇండియన్ బుల్లి తెర ప్రేక్షకులకు చేరువ అయిన ఈ అమ్మడు ముందు ముందు బాలీవుడ్ సినిమాల్లో కూడా నటించే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. బాలీవుడ్, సౌత్ సినిమాల్లో ఆఫర్లు వస్తే కాదు, వద్దు అనకుండా నటించేందుకు రెడీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆకట్టుకునే విధంగా ఉండే ఈ అమ్మడిని నిజంగానే శ్రేయస్ అయ్యర్ పెళ్లి చేసుకోవచ్చు కదా అంటూ కొందరు సరదాగా సోషల్ మీడియాలో కామెంట్స్ పెడుతూ ఉంటారు. ఇంతకు ఈమె గురించి శ్రేయస్ అయ్యర్ ఎలా స్పందిస్తాడు, ఈమె విషయాలు అతడి వద్దకి చేరి ఉంటాయా అనేది తెలియాల్సి ఉంది.



Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463